నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
శుక్రవారం | ఫిబ్రవరి 28, 2025 | www.navatelangana.com

భార్య కనిపించడం లేదని ఫిర్యాదు


సంగీత (ఫైల్)

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పట్టణం గ్రీన్ సిటీ కాలనీలో నివాసముండే వనం సంగీత (32) అనే వివాహిత ఈ నెల 25 నుంచి కనిపించడం లేదని ఆమె భర్త పాపయ్య పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేసినట్టు పట్టణ సిఐ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వనం పాపయ్య వారి బంధువులు చనిపోతే చావుకి వెళ్లాడు. అతని భార్య సంగీత ఒక్కతే ఇంటివద్దనే ఉంది. చావు నుంచి రాత్రి 8గంటలకు పాపయ్య వచ్చాడు. తన భార్య ఇంటివద్ద కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా కనిపించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చి తన భార్య తప్పిపోయినట్టుగా ఫిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేశారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు 8712686145, 8712666242 నెంబర్‌లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకున్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు

- పోలింగ్ తీరు పరిశీలన



నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రంలో జరుగుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ సరళిని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ పరిశీలించారు. ఓట్లు వేయడానికి వచ్చిన పట్టభద్రులకు ఓటర్ స్లిప్పులను అందజేశారు. అనంతరం ఆయన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కైలా శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి మండల అధ్యక్షుడు గూడెం శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.


కామారెడ్డి : ఓటింగ్ ప్రక్రియను తెలుసుకుంటున్న కామారెడ్డి కలెక్టర్


నిజామాబాద్‌సిటీ,కంఠేశ్వర్ : ఓటు వేస్తున్న మహిళ

సజావుగా ఓటింగ్

- పోలింగ్ కేంద్రాలు సందర్శించిన ఉమ్మడి జిల్లా కలెక్టర్లు
- పోలింగ్ సరళి పరిశీలన
- ఓటు హక్కు వినియోగించుకున్న నిజామాబాద్ జిల్లా ఎన్నికల అధికారి



నిజామాబాద్‌సిటీ,కంఠేశ్వర్ : ఓటు వేసేందుకు వచ్చిన వికలాంగుడు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ/ కంఠేశ్వర్/కామారెడ్డి/దోమకొండ

నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాలతో కూడిన కరీంనగర్ శాసన మండలి ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గాల ఎన్నికలకు సంబంధించి పోలింగ్ ప్రక్రియ నిజామాబాద్ జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పర్యవేక్షణలో నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ రెవెన్యూ డివిజన్ల పరిధిలో ఓటింగ్ నిర్వహణ కోసం అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. జిల్లా వ్యాప్తంగా 81 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, పట్టభద్రులు, ఉపాధ్యాయ ఓటర్లు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మేరకు పోలింగ్ కేంద్రాలలో ఉదయం 8.00 గంటలకు ఓటింగ్ ప్రక్రియ ప్రారంభం అయ్యింది. మొదటి రెండు గంటల వరకు ఒక మోస్తరుగా సాగిన ఓటింగ్, అనంతరం వేగం పుంజుకుంది. పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఓటింగ్ ప్రక్రియ సజావుగా జరిగిందని, ప్రశాంత వాతావరణంలో ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామని అన్నారు.

కాగా, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు జిల్లా కేంద్రంలోని సుభాష్ నగర్‌లో గల ఎస్.ఎఫ్.ఎస్ పాఠశాలలో పోలింగ్ స్టేషన్ నెంబర్ 122లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. అనంతరం కలెక్టర్ పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి అందుబాటులో ఉన్న సదుపాయాలను, పోలింగ్ నిర్వహణ తీరును పరిశీలించారు. మాక్లూర్ మండలం మాదాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల నియోజకవర్గ పోలింగ్ స్టేషన్లను సందర్శించిన కలెక్టర్, ఓటింగ్ కొనసాగుతున్న తీరును గమనించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ఇతర అధికారులతో కలిసి వెబ్ కాస్టింగ్ ద్వారా ఆయా పోలింగ్ కేంద్రాలలో నెలకొన్న పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. పోలింగ్ పూర్తయిన అనంతరం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ బ్యాలెట్ బాక్సులను ప్రత్యేక వాహనాలలో కరీంనగర్ లోని రిసెప్షన్ సెంటర్ కు తరలించేలా కలెక్టర్ పర్యవేక్షణ జరిపారు.

కామారెడ్డి/దోమకొండ : జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్టు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రులు, ఉపాధ్యాయుల నియోజకవర్గాల ఎన్నికల పోలింగ్ సరళిని గురువారం కలెక్టర్ పరిశీలించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాల 173వ పోలింగ్ స్టేషన్‌లో కలెక్టర్ తన ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఉదయం పూట ఓటర్లు బారులు తీరి తమ ఓటుహక్కు వినియోగించుకుంటున్నారని తెలిపారు. అనంతరం దోమకొండ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల, ఉపాధ్యాయ పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఓటింగ్ సరళి, ఏర్పాట్లపై ప్రిసైడింగ్, సెక్టోరల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ ద్వారా జిల్లాలోని పోలింగ్ సరళిని కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ సింధు శర్మ, అదనపు కలెక్టర్లు వి.విక్టర్, శ్రీనివాస్ రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


నిజామాబాద్‌సిటీ,కంఠేశ్వర్ : ఓటు వేసేందుకు వెళ్తున్న మహిళలు..



ఓటు హక్కు వినియోగించుకున్న ఓటర్లు

గెలుపుపై ఉత్కంఠ

హోరాహోరీగా జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలు

- ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్
- నెలకొన్న చతుర్ముఖ పోటీ



నవతెలంగాణ-కంఠేశ్వర్

ఎమ్మెల్సీ ఎన్నికలు ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ప్రధాన రాజకీయపార్టీలు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ ఎన్నికల్లో పాల్గొంటుండడంతో గెలుపు ఎవరిదనేదానిపై ఉత్కంఠ నెలకొంది. రెండు టీచర్స్ ఎమ్మెల్సీ, ఒక గ్రాడ్యుయేట్ స్థానానికి గురువారం పోలింగ్ జరిగిన విషయం తెలిసిందే. అయితే అందరి దృష్టి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రల స్థానంపై నెలకొంది. కాంగ్రెస్ నుంచి నరేంధర్ రెడ్డి, బీజేపీ తరపున అంజిరెడ్డి, బీఎస్పీ మద్దతుతో ప్రసన్న హరిక్రిష్ణ, స్వతంత్ర అభ్యర్థిగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, కరీంనగర్ మాజీ మేయర్ రవీందర్ సింగ్, ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ మద్దతుతో పోటీలో ఉన్న యాదగిరి శేఖర్ రావు వివిధ పార్టీల అభ్యర్థులతో సమానంగా పోటీపడ్డారు. అధికార కాంగ్రెస్ ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అదే సమయంలో బీజేపీ సైతం గెలుపే లక్ష్యంగా పనిచేసింది. ఆ పార్టీకి చెందిన నలుగు ఎంపీలు బీజేపీ అభ్యర్థి కోసం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ తరపున ఏకంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రచారంలో పాల్గొన్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీ ఈ ఎన్నికను ఎంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందో అర్థం చేసుకోవచ్చు. విద్యావంతులైన పట్టభద్రులు ఈ ఎన్నికల్లో ఓటు వేయనున్న నేపథ్యంలో గెలుపు ఎవరిదనేది తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. రాజకీయ పార్టీల తరపున అభ్యర్థులు పోటీలో ఉన్నప్పటికీ ఓటర్లు తమకు ఇష్టమైన అభ్యర్థికి ఓటు వేసుకునే అవకాశం ఉంటుంది.

కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ ఉమ్మడి జిల్లాలకు సంబంధించి పట్టభద్రులు, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఈ రెండుచోట్ల బీజేపీ అభ్యర్థులు పోటీచేస్తుండగా కాంగ్రెస్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల్లో మాత్రమే పోటీచేస్తోంది. ఎక్కువమంది ఓటర్లు ఉన్న పట్టభద్రుల స్థానంలో మాత్రం చతుర్ముఖ పోటీ నెలకొంది. బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి మధ్య నువ్వా-నేనా అన్నట్లు పోటీ ఉందనే ప్రచారం జరుగుతున్నప్పటికీ.. బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ కూడా వారిద్దరికి గట్టి పోటీనే ఇచ్చారనే ప్రచారం జరిగింది. ఇక చాపకింద నీరులా యాదగిరి శేఖర్ రావుకు సైలెంట్ ఫోలింగ్‌లో ఓట్లు పడ్డాయని సమాచారం.

కరీంనగర్ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీకి పోటీలో 56 మంది అభ్యర్థులు ఉన్నప్పటికీ నలుగురు అభ్యర్థుల మధ్య ప్రధానపోటీ నెలకొంది. ఈ నలుగురు అభ్యర్థుల్లో ముగ్గురు విద్యారంగానికి సంబంధించిన వ్యక్తులు కాగా బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డికి ప్రత్యక్షంగా విద్యారంగంతో సంబంధం లేదు. పోటీపరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థుల కోసం స్టడీ మెటిరీయల్ తయారీలో నైపుణ్యం ఉన్న ప్రసన్న హరికృష్ణకు గ్రాడ్యుయేట్లను నమ్మి బరిలో నిలిచారు. అదే సమయంలో పార్టీల బలం అంజిరెడ్డి, నరేందర్ రెడ్డికి ప్లస్ భావిస్తున్నారు. ప్రయివేట్ స్కూల్ అసోసియేషన్ మద్దతుతో పోటీలో ఉన్న శేఖర్ రావు సైతం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. దీంతో గెలుపుపై నలుగురు అభ్యర్థులు ఆశలు పెట్టుకున్నారు. కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల స్థానం నుంచి ఎవరు గెలిచినా మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిచే అవకాశం లేదనేది సుస్పష్టం. నలుగురు అభ్యర్థుల మధ్య ప్రధానపోటీ నెలకొని ఉండటంతో మూడు లేదా నాలుగో ప్రాధాన్యత ఓటుతో మాత్రమే ఫలితం తేలే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. సాధారణంగా ప్రధాన పార్టీల అభ్యర్థులైన అంజిరెడ్డి, నరేందర్ రెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసిన ఓటర్లు రెండు లేదా మూడో ప్రాధాన్యత ఓటు ఎవరికి వేసి ఉంటారనేదానిపై జోరుగా చర్చ జరుగుతోంది. గురువారం పోలింగ్ ముగియగా, మార్చి 3న ఓట్లు లెక్కించనున్నారు. సోషల్ మీడియాలో ప్రచారం జరిగినట్లు బీసీ వాదం పనిచేసిందా లేదా అనే ఫలితాల నాడు స్పష్టం కానుంది. రాజకీయంగా తమ భవిష్యత్తు కార్యచరణకు ఎమ్మెల్సీ ఎన్నికలు తొలి అడుగు అని చెప్పాలి.

ఉమ్మడి జిల్లాలో ప్రశాంతంగా పోలింగ్

నవతెలంగాణ-కంఠేశ్వర్/కామారెడ్డి

నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల సమయానికి ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ పూర్తి అయ్యింది. నిజామాబాద్ జిల్లాలో 10 మండలాల్లో 21 పోలింగ్ బూత్‌లలో 14,341 ఓటర్లు ఉండగా 10,779 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా జిల్లా వ్యాప్తంగా 77.24శాతం పోలింగ్ నమోదైనట్టు అధికారులు తెలిపారు. దీంతో నిజామాబాద్ డివిజన్‌లో 75.16 శాతం పోలింగ్ నమోదయింది. అదేవిధంగా ఆర్మూర్ డివిజన్‌లో 13 మండలాల్లో 16 పోలింగ్ బూత్‌లలో 12,196 మంది ఓటర్లు ఉండగా 9357 ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో ఆర్మూర్‌లో 77.92 శాతం పోలింగ్ నమోదయింది. బోధన్ డివిజన్‌లో 10 మండలాలలో 11 పోలింగ్ బూత్‌లలో 5037 ఓటర్లు ఉండగా 4106 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో బోధన్‌లో 81.52 శాతం పోలింగ్ నమోదయింది. మొత్తంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో (పట్టభద్రుల నియోజకవర్గం) ఎమ్మెల్సీ ఎన్నికలలో 33 మండలాలలో 48 పోలింగ్ బూత్‌లలో 31,574 ఓటర్లు ఉండగా 24,242 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ 77.24 శాతం నమోదు అయ్యింది. నిజామాబాద్ జిల్లాలో టీచర్ ఎమ్మెల్సీకి నిజామాబాద్ డివిజన్‌లో 90.85, ఆర్మూర్‌లో 94.38, బోధన్‌లో 94.15 పోలింగ్ శాతం నమోదు కాగా.. నిజామాబాద్ జిల్లాలో టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తంగా 92.94శాతం నమోదు అయింది.


మహిళా ఉపాధ్యాయులే కీలకం

కామారెడ్డి : ఎమ్మెల్సీ ఎన్నికల్లో అత్యధికంగా మహిళా ఉపాధ్యాయులే తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా 1307 మంది పురుష ఉపాధ్యాయులు ఉండగా అందులో 1216 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మహిళా ఉపాధ్యాయులు 704 మంది ఉండగా 667 మంది మహిళా ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తంగా పురుష ఉపాధ్యాయులు 93 శాతం తమ ఓటు హక్కును వినియోగించుకోగా, మహిళ ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును 94.74 శాతం వినియోగించుకున్నారు. పట్టభద్రుల్లో పురుష ఓటర్లు 11,616 కాగా 9127 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మహిళా పట్టభద్రులు 4793 కాగా 3693 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుకు నోటు

- లొంగని పట్టభద్రులు, ఉపాధ్యాయులు



నవతెలంగాణ-వర్ని

ఉమ్మడి మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులకు, ఉపాధ్యాయులకు నోటుతో ఓటు కోసం పలు పార్టీలు గాలం వేసినట్లు సమాచారం. ఓ పార్టీ విందులు ఇచ్చి మా అభ్యర్థికి ఓటు వేయాలని కోరితే.. మరో పార్టీ ఓటుకు నోటు ఇచ్చినట్టు సమాచారం. ఒక్క ఓటుకు రూ.2000 వేలు నుంచి పై బడి ఓటుకు నోటు చెల్లించారని అందులో ఒక పార్టీలోని నాయకులు కొందరికే డబ్బులు పంపిణీ చేసి మిగతా వారికి ఇవ్వకుండా జేబులు నింపుకోవడంతో ఈ ఓటుకు నోటు వ్యవహారం బయటపడింది.

నోటుకు లొంగని పట్టభద్రులు, ఉపాధ్యాయులు..

విద్యావంతులు నోటు కోసం ఓటును అమ్ముకోరనే నిజాన్ని చాటిచూపారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఓటర్లు తమకు ఏ పార్టీ నోట్లు వద్దు మా ఓటు ఎవరికి వేయాలనేది మాకు స్పష్టత ఉందని నాయకుల మొఖంపై చెప్పినట్లు ఆరోపణలు. దీంతో విద్యావంతుల ఓట్లు మరి ఎవరికి పడ్డాయో ఓట్ల లెక్కింపు వరకూ వేచి చూడాల్సిందేనని ప్రజలు అంటున్నారు.

తాండూర్‌లో ఎడ్లబండ్ల ప్రదర్శన


ఎడ్లబండ్ల ప్రదర్శన

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని తాండూర్ గ్రామంలో గల శ్రీలింగ రామేశ్వర ఆలయం వద్ద గురువారం గ్రామస్తులు ఎడ్లబండ్ల ప్రదర్శనను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల నుంచి గ్రామస్తులు తమ తమ ఎడ్లబండ్లను అందంగా అలంకరించి ఆలయం వద్ద ఎడ్ల పనులను ప్రదర్శించారు. అనంతరం ఆలయం వద్ద తమ మొక్కులను చెల్లించుకున్నారు.

నివాసపు గుడిసె దగ్ధం



నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని గొడుగుమర్రి తాండ గ్రామపంచాయతీ పరిధిలోని సున్నపురాళ్ల తండాలో బుధవారం రాత్రి నివాసపు పూరి గుడిసె దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బట్టు దేవకి, జమునకు చెందిన నివాసపు గుడిసె ఆకస్మికంగా మంటలు చెలరేగి ఖాళీ బూడిదయ్యింది. మూడు క్వింటాళ్ల బియ్యం, రెండు క్వింటాళ్ల మొక్కలతోపాటు, వెండి, నగదు, నిత్యావసర సరుకులు పూర్తిగా ఖాళీ బూడిదయ్యాయి. ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

తాడ్‌బిలోలి గ్రామంలో వ్యక్తి అదృశ్యం



నవతెలంగాణ-రెంజల్

మండలంలోని తాడ్‌బిలోలి గ్రామానికి చెందిన సాకిన్‌గారి పోశెట్టి అదృశ్యమైనట్లు రెంజల్ ఎస్ఐ ఈ.సాయన్న తెలిపారు. ఈనెల 21 నుంచి ఇంట్లో కనబడకపోవడంతో కుమారుడు సాకిల్ గారి రవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 8712659874 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

ఆకట్టుకున్న కుస్తీ పోటీలు

- చివరి కుస్తీ నిర్వహించకుండానే ముగిసిన పోటీలు


తలపడుతున్న మల్లయోధులు.. తిలకిస్తున్న జనం..

నవతెలంగాణ-బోధన్

మహా శివరాత్రి పండుగ సందర్భంగా సాలూర మండల కేంద్రంలో సాంప్రదాయంలో భాగంగా మరుసటి రోజు నిర్వహించిన కుస్తీ పోటీలు ఆకట్టుకున్నాయి. సమీప ప్రాంతాల నుంచి, మహారాష్ట్ర పరిసర ప్రాంతాల నుంచి మల్లయోధులు తరలివచ్చి కుస్తీ పోటీలలో తలపడ్డారు. కుస్తీ పోటీలో విజేతలయిన మల్లయోధులకు గ్రామ పెద్దలు నగదు బహుమతి అందించారు. అయితే సాంప్రదాయంలో భాగంగా చివరగా నిర్వహించాల్సిన కుస్తీని అర్ధాంతరంగా రద్దుచేయడంతో కొంతమంది వ్యతిరేకించారు. కుస్తీ నిర్వహణలో గ్యాలరీలో ఎవరుపడితే వారు తిరగడంతో ప్రేక్షకులు ఇబ్బందులు పడవలసి వచ్చింది. బందోబస్తు కోసం పోలీసులు ఉన్నా ప్రేక్షక పాత్ర వహించారు. రాబోయే రోజులలోనైనా కుస్తీపోటీలు గందరగోళంగా కాకుండా పకడ్బందీగా నిర్వహించాలని మల్లయోధులు, గ్రామస్తులు కోరుతున్నారు.

పోలింగ్ స్టేషన్‌లో కనీస వసతులు కరువు

నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రంలో గురువారం ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా నిర్వాహకులు కనీస వసతులు కూడా ఏర్పాటు చేయకపోవడంతో ఓటర్లు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. టీచర్స్ 36 మందికి 36 మంది ఓటు హక్కును వినియోగించుకోగా, 472 మంది పట్టభద్రుల ఓటర్లకు గాను 397 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 84.11 శాతం ఓట్లు పోలైనట్లు అధికారులు తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వివిధ గ్రామాల నుంచి ఓటర్లు తరలివచ్చినా.. పోలింగ్ స్టేషన్ వద్ద కనీసం తాగడానికి నీరు లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. రామారెడ్డి మండలం కామారెడ్డి, ఎల్లారెడ్డి నియోజకవర్గాల పరిధిలో ఉండడంతో ఎల్లారెడ్డి గ్రామాల ఓటర్లకు సూచనలు ఇవ్వడానికి సిబ్బంది ఉన్నా కామారెడ్డి నియోజకవర్గ గ్రామాల ఓటర్లకు సూచనలు ఇవ్వడానికి సిబ్బంది లేకపోవడంతో ఓటర్లు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. కాగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లను చేశారు.

పోలింగ్ సరళి పరిశీలన


నిజాంసాగర్ : పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

నవతెలంగాణ-పిట్లం/మద్నూర్/నిజాంసాగర్

ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు గానూ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఏర్పాటు చేసిన పోలింగ్ సరళిని బాన్సువాడ డివిజనల్ జాయింట్ కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి సందర్శించి ప్రశాంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎన్నికలకు గానూ ఏర్పాటు చేసిన 112, 167 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ కొనసాగుతున్న సరళిని, మెడికల్ కిట్లులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల పర్యవేక్షకులు వేణుగోపాల్, ఎంపీడీవో కమలాకర్, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు పోలింగ్ జరిగిన నేపథ్యంలో మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సందర్శించి పోలింగ్ తీరును పరిశీలించారు. పోలింగ్ అధికారులతో మాట్లాడి వివరాలన్నీ తెలుసుకున్నారు. మద్నూర్ మండల కేంద్రంలో జరిగిన ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాల వద్ద ప్రశాంతతపై బందోబస్తు ఏర్పాట్లను చూసి అభినందించారు. సబ్ కలెక్టర్ వెంట మద్నూర్ మండల తహసీల్దార్ ఎండి మూజిక్ తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్ : మహ్మద్‌నగర్, నిజాంసాగర్ పోలింగ్ కేంద్రాన్ని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రంలో పోలింగ్ జరుగుతున్న తీరును ఆమె పరిశీలించారు.

ఎఐసీసీటియు జాతీయ కౌన్సిల్‌కు ముగ్గురు ఎన్నిక



నవతెలంగాణ-భీంగల్ రూరల్

అల్ ఇండియా సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ రాష్ట్ర అధ్యక్షులుగా అక్కినపల్లి యాదగిరి, రాష్ట్ర కార్యదర్శిగా రొయ్యల రాజు, ఉపాధ్యక్షులుగా ఖాజా మోహినుద్దీన్ గురువారం ఎన్నికయ్యారు. ఎఐసిసిటియు జాతీయ మహాసభలు ఫిబ్రవరి 24, 25, 26 తేదీల్లో న్యూఢిల్లీలో జరిగినట్టు తెలిపారు. భారతదేశంలో అన్ని రంగాల కార్మికుల సమస్యలు, కనీస సౌకర్యాలు కల్పించేందుకు కీలకమైన కర్తవ్యాలు తీసుకున్నట్టు వివరించారు. పలు తీర్మానాలు మహాసభలో ఆమోదించినట్టు తెలిపారు. నూతన జాతీయ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు చెప్పారు.

డిఈఓకు సన్మానం



నవతెలంగాణ-ఆర్మూర్

మండల ప్రైవేట్ స్కూలు అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా విద్యా శాఖ అధికారి పి.అశోక్‌ను గురువారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ.. పిల్లల సమగ్ర విద్యాభివృద్ధికి ప్రైవేట్ పాఠశాలలు భాగస్వామ్యం కావాలని, నాణ్యమైన విద్యను అన్నివర్గాల ప్రజలకు అందించాలని కోరారు. ప్రైవేట్ స్కూలు అసోసియేషన్ అధ్యక్షులు భరత్ చంద్ర మల్లయ్య, కార్యదర్శి శ్రీ విద్య ప్రవీణ్ పవార్ మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థి చదువుతోపాటు సంస్కారం, సద్బుద్ధి, సత్ప్రవర్తన, దేశ భక్తి పెంపొందించడమే తమ లక్ష్యమని తెలిపారు, సమావేశంలో మండల కోశాధికారి స్కాలర్స్ వేణు, రాష్ట్ర బాధ్యులు కాంతి గంగారెడ్డి, శ్రీ భాషిత సుందర్. తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతి

నవతెలంగాణ-కంఠేశ్వర్



మృతి చెందిన మహిళ

జిల్లా కేంద్రంలోని ఒకటవ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్టు ఎస్‌హెచ్‌ఓ రఘుపతి గురువారం తెలిపారు. ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. ఒకటవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 23న ఆర్టీసీ బస్టాండ్ దగ్గర ఒక గుర్తు తెలియని మహిళ అందజ (40) అపస్మారక స్థితిలో ఉన్నందున 108 అంబులెన్స్ ద్వారా ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారని తెలిపారు. చికిత్స పొందుతూ ఈనెల 25న మృతి చెందినట్టు పేర్కొన్నారు. ఈమె ఆరెంజ్ కలర్ చీర ధరించిందని, ఈమె వాలకం బట్టి లేబర్ పని చేసుకునే మహిళగా కనపడుతుందని తెలిపారు. సమాచారం తెలిసిన వారు ఫోన్ నెంబర్ 8712659714 కు సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన వ్యక్తి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని మూడవ పోలీస్ స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్టు ఎస్ఐ హరిబాబు గురువారం తెలిపారు. నిజామాబాద్‌లోని పంబోలి ఏరియాలో ఒక గుర్తు తెలియని మగ వ్యక్తి అందాజ(40) ఏండ్లు మృతి చెందినట్టు సమాచారం మేరకు వెళ్లినట్టు తెలిపారు. మృతదేహాన్ని పరిశీలించిగా రెండు రోజుల క్రితం చనిపోయి ఉండవచ్చని పోలీసులు భావించారు. ఆ వ్యక్తిని ఎవరైనా గుర్తుపడితే బంధువులు ఎవరైనా ఉన్నట్లయితే మూడో టౌన్ ఎస్‌హెచ్‌వో నెంబర్ 8712659839, 8712659717కు సంప్రదించాలని తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



అదృశ్యమైన కమ్రుద్దీన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని ఒకటవ పోలీస్ స్టేషన్ పరిధిలోని మాలపల్లి ప్రాంతానికి చెందిన ఎస్.కె కమ్రుద్దీన్ అదృశ్యం అయినట్టు ఒకటవ పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్‌హెచ్‌ఓ రఘుపతి గురువారం తెలిపారు. మాలపల్లికి చెందిన ఎస్.కె కమ్రుద్దీన్ మతిస్థిమితం కోల్పోయి మహారాష్ట్రలో తిరుగుతున్నాడని చెప్పాడు. ఎవరైనా గుర్తు పడితే నిజామాబాద్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలన్నారు.

చెరువులో గుర్తు తెలియని శవం లభ్యం

నవతెలంగాణ-ధర్పల్లి

మండల కేంద్రంలోని ఊర చెరువులో గుర్తు తెలియని వ్యక్తి శవం గురువారం లభ్యమైనట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. వయసు 35 నుంచి 40 సంవత్సరాల మధ్యలో ఉంటుందని, శవంపై తెలుపు, బ్లాక్ రంగుల గీతల షర్ట్, వైట్ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నట్టు పేర్కొన్నారు. సమాచారం తెలిసిన వారు ఈ నెంబర్‌లకు 8712659856, 8712659855 సంప్రదించాలని తెలిపారు.

న్యాయవాది ఎల్లయ్య మృతికి సంతాపం



కంఠేశ్వర్ : మాట్లాడుతున్న బార్ అసోసియేషన్ అధ్యక్షులు

నవతెలంగాణ-కంఠేశ్వర్/ఆర్మూర్

బోధన్ బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది కంటే యెల్లయ్య మృతి చాలా బాధాకరమని నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లెపూల జగన్ మోహన్ గౌడ్ అన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని బార్ సమావేశపు హాల్ లో నిర్వహించిన సంతాప సమావేశంలో ఆయన మాట్లాడారు. బోధన్ ప్రాంత రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ పూర్వ కార్యకర్తగా,బోధన్ శిశుమందిర్ పాఠశాల ప్రబంధ్ కారునిగా ఎనలేని సేవలు అందించి సమాజోద్ధరణకు కృషి చేశారని తెలిపారు.జ్యూడిషియల్ ఉద్యోగిగా న్యాయవాదులు న్యాయ సిబ్బందితో స్నేహపూర్వకంగా ఉండేవారని పేర్కొన్నారు. అనంతర కాలంలో న్యాయవాదిగా సేవలు అందించారని కొనియాడారు. సంతాప సూచకంగా న్యాయవాదులు రెండు నిమిషాలు మౌనం వహించారు. తదనంతరం విధులకు హాజరుకాలేదు. సమావేశంలో బార్ కౌన్సిల్ సభ్యులు మంథని రాజేందర్ రెడ్డి, బార్ ఉపాధ్యక్షుడు రాజు,కార్యదర్శి దొన్పల్ సురేష్, కోశాధికారి దీపక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మూర్ : బోధన్ కోర్ట్ బార్ అసోసియేషన్ సభ్యులు న్యాయవాది కె.ఎల్లయ్య మృతికి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం న్యాయవాదులు సంతాపం తెలుపుతు రెండు నిముషాలు మౌనం పాటించారు. న్యాయవాదులు విధులకు హాజరుకాలేదు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు తెడ్డు నర్సయ్య మాట్లాడుతూ... న్యాయవాది కె.ఎల్లయ్య మృతి న్యాయవాద వృత్తికి తీరని లోటు అని అన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు నరేందర్, తాజోద్దీన్, అశోక్, ప్రవీణ్, హరి వర్ధన్, సైపొద్దిన్, శ్యామ్, రాజేందర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మల్కాపూర్‌లో అన్నదానం



నిజామాబాద్ రూరల్ : మల్కాపూర్ తండాలో

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్/ఆర్మూర్

నిజామాబాద్ రూరల్ మండలం మల్కాపూర్ తాండ శ్రీ జగదాంబ మాత, సేవాలాల్ మహారాజ్, రామారావు యొక్క మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహాశివరాత్రి ఉపవాస దీక్షలు చేపట్టిన వారికోసం ఆలయ కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. అన్నదాన బోగ్ బండార్ కార్యక్రమం నిర్వహించారు. 26 మంది నాయక్‌లు 26 మంది కారోబారిల ఆధ్వర్యంలో గ్రామ ప్రజలందరికీ అన్నదాన కార్యక్రమం చేపట్టారు.


ఆర్మూర్ : పట్టణంలోని సిద్దుల గుట్ట, పిస్స మల్లన్న, పెర్కిట్ శివ పంచాయతన ఆలయం, మామిడిపల్లి ముజేగే మల్లన్న శివాలయం, మండలంలోని ఇస్సపల్లి లక్ష్మీనరసింహస్వామి, రాజరాజేశ్వర, చేపూర్ శివాలయ ప్రాంగణంలో శివరాత్రి మహా పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

రెడీమేడ్ దెబ్బ..



దర్జీలకు తగ్గిన ఆదరణ

నేడు ప్రపంచ టైలర్స్ దినోత్సవం



నవతెలంగాణ-ఆర్మూర్


మనిషికి కావలసింది కూడు, గూడు, గుడ్డ. అందులో దుస్తులు ప్రధానమైనవి. వాటిని మలిచేవారే టైలర్. సాధారణ వస్త్రాన్ని కత్తిరించి కలిపి కుట్టి ఓ రూపు తెచ్చేది దర్జీలు. ఓ మనిషికి డ్రెస్సులతో హుందాతనాన్ని తీసుకువస్తున్న దర్జీల బతుకుల్లో దర్జా మాయమవుతుంది రెడీమేడ్ దుస్తుల రాకతో ఉపాధి కరువైంది కులవృత్తిని నమ్ముకున్న వారి పరిస్థితి దయనీయంగా మారింది. చాలామంది బతుకుతెరువు కోసం గల్ఫ్ బాటపడుతూ... కొందరు ఇతర పనులను వెతుక్కుంటున్నారు. నేడు ప్రపంచ టైలర్స్ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం...

టైలర్స్ డే చరిత్ర...

కుట్టుమిషన్ లేని రోజుల్లో షర్ట్స్ ప్యాంట్లును కాస్త అటు ఇటుగా చేతితోనే కుట్టేవారు. జర్మన్ దేశానికి చెందిన విలియమ్స్ హెూ అనే శాస్త్రవేత్త 1916లో కుట్టు మిషన్‌ను కనుగొన్నారు. ఆయన ఫిబ్రవరి 28న జన్మించారు. ఆయన జన్మదినాన్ని టైలర్స్‌డేగా నిర్వహిస్తున్నారు. గతంలో మేరు కులానికి చెందినవారు మాత్రమే దర్జీ వృత్తిని చేపట్టేవారు. పండుగలు, శుభకార్యాల సమయంలో వారికి చేతినిండా పని ఉండేది. తిందామన్న తీరిక ఉండేది కాదు. కాలక్రమేనా ఇతర కులాల వారు దర్జీ వృత్తిని స్వీకరించడంతో పని తగ్గింది. రెడీమేడ్ దుస్తుల రాకతో పరిస్థితి దయనీయంగా మారింది. మార్కెట్లోకి వస్తున్న కొత్త ఫ్యాషన్లకు అనుగుణంగా బట్టలు కుట్టే నేర్పు ఉన్న, రెడీమేడ్ దుస్తుల వల్ల వారికి ఆదరణ తగ్గుతూ వస్తుంది.రెడీమేడ్ దుస్తులు లభిస్తుండడంతో చాలామంది వాటిని కొనుగోలు చేస్తున్నారు. దీంతో దర్జీలకు ఉపాధి తగ్గిపోతుంది. పండగల సమయంలో గిరాకీ ఉండడం లేదు. చేయడానికి పని లేకపోవడంతో పలువురు దర్జీ వృత్తిని వదులుకొని బతుకుదెరువు కోసం గల్ఫ్ బాట పట్టారు. గల్ఫ్ దేశాల్లో భవన నిర్మాణ కార్మికులుగా, వాచ్మెన్లుగా పనిచేయడానికి వెళుతున్నారు. కొందరు కులవృత్తిని వదులుకోలేక స్థానికంగా ఉంటున్నారు. గతంలో దసరా పండుగకు రెండు నెలల ముందుగానే సీజన్ ప్రారంభమై బట్టలు కుట్టించుకోవడానికి ప్రజలు వరుస కట్టేవారు. పండుగకు చాలా రోజుల ముందు నుంచే కొత్త ఆర్డర్లు తీసుకోకపోయే వాళ్లు, గాని నేడు రెడీమేడ్ దుస్తులు కొంటున్నారు. స్కూలు యూనిఫాంలో సైతం రెడిమేడ్‌వే వస్తున్నాయి.

ప్రోత్సాహం కరువు...

టైలరింగ్ వృత్తిని ప్రోత్సహించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. కార్పొరేషన్ల ద్వారా అంతంత మాత్రంగానే రుణాలు ఇస్తుంది.



ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని దర్జీలు కోరుతున్నారు.

కూలి రేట్ల ప్రభావం...

రెడీమేడ్ దుస్తుల రాకతో కుట్టించుకున్న దుస్తుల ధరలు ఎక్కువగా ఉండడంతో ఆసక్తి చూపించడం లేదు. సంపన్న వర్గాల వారు మాత్రమే వస్త్రాన్ని కొని దుస్తులు కుట్టించుకుంటున్నారు. కానీ వారు షోరూంలోని దుస్తులను కుట్టడంతో పేద దర్జీలకు ఉపాధి లభించడం లేదు. ప్రస్తుతం కూలి రేట్లు ఒక్కొక్క జతకు ఎనిమిది వందల నుండి 1000 రూపాయలు తీసుకుంటున్నారు. ఇదే ధరలో రెడీమేడ్ దుస్తులు లభించడంతో ప్రజలు దర్జీల వద్ద కుట్టించుకోవడానికి ఆసక్తి చూపడం లేదు.

కులవృత్తులను ప్రోత్సహించాలి



దర్జీలను ఆదుకోవడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. విద్యాశాఖ, పోలీస్ శాఖలో కుట్టించేందుకు టెండర్లను మేరు కులస్తులకు ఇవ్వాలి. దర్జీ వృత్తి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం కుల వృత్తుల సంక్షేమానికి ఎన్నో పథకాలు చేపడుతున్నందున దర్జీలను కూడా ఆదుకోవాలి .

శ్రీరామ్ హేమంత్,.. ఐ మెక్స్ టైలర్ సీనియర్ మాస్టర్, ఆర్మూర్.

ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి



రోజు రోజుకి దర్జీ వృత్తి మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుంది. చేయడానికి పని లేక దర్జీలు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దర్జీలను ఆదుకోవడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

శ్రీనివాస్, రాచర్ల టైలర్స్, స్టూడియో, ఆర్మూర్.

పొలాల్లో పైపులు తొలగింపు

- వంతెన లేక పొలాలకు వెళ్లేందుకు లేని దారి
- రైతులకు తప్పని ఇబ్బందులు



నవతెలంగాణ-మోర్తాడ్

వ్యవసాయ భూములకు వెళ్లడానికి రైతులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ముసలమ్మ చెరువు అలుగు నీరు పొంగిపొర్లి వ్యవసాయ పంట పొలాలకు వెళ్లే రహదారి పూర్తిగా కొట్టుకపోవడంతో రెండు సంవత్సరాల క్రితం పైపులతో రహదారి నిర్మించారు. ఈ దారికి గత ప్రభుత్వ హయాంలో కోటి యాభై లక్షల రూపాయల నిధులతో వంతెన నిర్మాణానికి మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి శంకుస్థాపన నిర్వహించారు. శంకుస్థాపన చేసి 14 నెలలు గడుస్తున్న వంత నిర్మాణ పనులు చేయకపోవడంతో రైతులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. నాలుగు సంవత్సరాల నుండి భారీ స్థాయిలో వర్షాలు పడి నీరు ప్రవాహం అధికంగా ఉండడంతో పంట పొలాల్లోకి వెళ్లే రహదారి కొట్టుకపోయింది. రైతుల ఇబ్బందుల దృష్ట్యా అప్పటి మంత్రి ప్రశాంత్ రెడ్డి పైప్ లైన్ నిర్మాణానికి పైపులను రైతులకు అందించారు. ఆ పైప్ లైన్ నిర్మాణంతో రైతులు సుమారు 50 మందికి పైగా 200 ఎకరాల పంట సాగుకు రహదారి ఏర్పాటు చేసుకొని వెళ్తున్నారు. ప్రస్తుతం ప్యాకేజ్ 21 పైపులు చోరీ జరిగాయి అనే వార్తతో రెండు సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన పైపులను సంబంధంలేని వారు సైతం ఇవే పైపులంటూ వాటిని తొలగించి రైతులకు ఇబ్బందులకు గురి చేస్తున్నారు. చోరీకి జరిగిన పైపులను రికవరీ చేయాల్సిన అధికారులు రైతులు అందించిన పైపులను తీసుకెళ్లడం రైతులకు ఇబ్బంది కలుగుతుందని, బ్రిడ్జి నిర్మాణం అయ్యేవరకు పైపులను ఉంచి తర్వాత అందిస్తామని తెలిపిన వినకుండా పంట పొలాలకు వెళ్లే దారిని పూర్తిగా తొలగించారు. సుమారు 200 ఎకరాల వరి పంటకు సాగునీటితోబాటు పరిశీలనకు వెళ్లడానికి ఇబ్బంది కలుగుతుందని, మరో 50 ఎకరాల తోట సైతం ఉందని రైతులకు తెలిపారు. ప్రస్తుతం పూర్తిగా ప్రమాద స్థాయిలో ఉన్న బ్రిడ్జిని తొలగించి నూతన బ్రిడ్జిని నిర్మించి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని రైతులు కోరుతున్నారు. నిధులు మంజూరైనప్పటికీ ఆ నిధులతో పనులు ప్రారంభించకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నామని వాపోతున్నారు. తక్షణమే ప్రమాద స్థాయిలో ఉన్న వంతెనను తొలగించి పూర్తిస్థాయి వంతెనను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. ప్రస్తుతం ఆ రహదారి గుండా ఉన్న పాత వంతెన పిల్లర్లకు సైతం పగుళ్లు ఏర్పడింది. పైప్‌లైన్ తొలగించడంతో ఆ దారి గుండా ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లడంలేదు. పంట పొలాల్లోకి వెళ్లడానికి వాగు దాటలేని పరిస్థితి ఏర్పడింది. పంట పొలాలు పరిశీలనకు వెళ్లడానికి కూడా ఇబ్బందులకు గురవుతున్నామని, తక్షణమే అధికారులు వంతెన నిర్మాణ పనులు చేపట్టాలని, లేకుంటే తొలగించిన పైప్లైన్ ఏర్పాటు చేయాలని రైతుల డిమాండ్ చేస్తున్నారు.

ఈగ సంజీవరెడ్డికి సన్మానం



నవతెలంగాణ-మోపాల్

మండలంలోని బోర్గం(పి) గ్రామ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో గురువారం మహా శివరాత్రి పురస్కరించుకొని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన మాజీ నూడా చైర్మన్, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు ఈగ సంజీవరెడ్డి దంపతులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు కమ్మరి విజయ్, కమలాపుర్ గంగాధర్, కాంచరీ అంజయ్య, గోపి, శాస్త్రి, శివ శంకర్, శ్రీధర్, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

చంద్రశేఖర్ ఆజాద్ స్ఫూర్తితో
మతోన్మాదం, ఫాసిజంకు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం

- ఆజాద్ చంద్రశేఖర్ 94వ వర్ధంతి సందర్భంగా నివాళులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

బ్రిటిష్ సామ్రాజ్యవాదులను తరిమికొట్టి ఈ దేశానికి స్వేచ్ఛ స్వతంత్రాల కోసం పోరాడిన వీర యోధుడు చంద్రశేఖర్ ఆజాద్ అని వక్తలు కీర్తించారు. ప్రగతిశీల యువజన సంఘం(పివైఎల్) ఆధ్వర్యంలో స్థానిక ద్వారక నగర్ కార్యాలయంలో స్వాతంత్ర సమరయోధుడు కామ్రేడ్ చంద్రశేఖర్ ఆజాద్ 94 వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రగతిశీల యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు వనమాల సత్యం మాట్లాడుతూ చంద్రశేఖర్ ఆజాద్ భారతదేశాన్ని బ్రిటిష్ వారినుండి విముక్తి చేయడం కోసం భగత్ సింగ్ తదితరులతో కలిసి పోరాడారని తెలిపారు. చివరి వరకు బ్రిటిష్ వారికి దొరకకుండా స్వాతంత్ర పోరాటాన్ని నడిపించారు. భారతదేశంలోని యువకులని స్వాతంత్రోద్యమంలోకి తీసుకురావడానికి ప్రేరణగా నిలిచారన్నారు. నాడు బ్రిటిష్ సామ్రాజ్యవాదంను తరిమికొడితే నేడు పాలకులు ప్రపంచీకరణ సరళీకరణ విధానాలతో భారతదేశాన్ని ప్రపంచ మార్కెట్‌గా మార్చారని విమర్శించారు. ప్రతి రంగాన్ని ప్రైవేటీకరణ చేస్తూ దేశాన్ని విదేశీ పెట్టుబడి దారుల దగ్గర తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. సభకు హాజరైన భారత కార్మిక సంఘాల సమైక్య (ఐఎఫ్టియు) జిల్లా కార్యదర్శి ఎం శివకుమార్ మాట్లాడారు. భారతదేశం నుంచి విదేశీ పాలకులు పోవాలని ఆజాద్ ఉద్యమించారని కానీ నేడు స్వదేశీ పాలకులు విదేశీ సంస్థలను బాహటంగా ఆహ్వానిస్తున్నాయని అన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ కార్మికుల పని గంటల్ని పెంచి వారి హక్కులను కాలరాసే విధంగా నల్ల చట్టాలను తీసుకు వస్తున్నారని విమర్శించారు. దేశంలో రోజురోజుకు ఉద్యోగ భద్రత లేకుండా పోతుందని నిరుద్యోగం పెరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో మరోసారి స్వేచ్ఛ కోసం సమానత్వం కోసం పాసిజంకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక జిల్లా కార్యదర్శి న్యాయవాది జి రమేష్ ప్రగతిశీల యువజన సంఘం నాయకులు రాజు ,ఇఫ్టు నాయకులు శంకర్ విజయ్ శ్రీను, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ను పరిశీలించిన రూరల్ ఎమ్మెల్యే



మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

నిజామాబాద్ రూరల్ పరిధిలోని ముబారక్ నగర్ గ్రామంలో 128, 129 పోలింగ్ బూత్‌లను రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి గురువారం పరిశీలించారు. ఎన్నికల ఏర్పాట్లు సక్రమంగా ఉన్నాయని, గ్రాడ్యుయేట్ ఓటర్లు తమ ఓటును సక్రమంగా వినియోగించుకుంటున్నారని తెలిపారు.

టాలెంట్ టెస్ట్‌ను వినియోగించుకోవాలి

- ప్రశ్నపత్రాలను విడుదల చేసిన జాయింట్ కలెక్టర్, డీఈవో



ప్రశ్నపత్రాలు ఆవిష్కరణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ నిర్వహించే పదవ తరగతి టాలెంట్ టెస్ట్‌ను ఉపయోగించుకొని బోర్డు ఎగ్జామ్‌లో అధిక మార్కులు సాధించాలని తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, విద్యాశాఖ అధికారి అశోక్ చేతుల మీదుగా ప్రశ్నాపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి విగ్నేష్ మాట్లాడుతూ.. గత 30 సంవత్సరాల నుంచి ఐఐటి చుక్కా రామయ్య ప్రోద్బలంతో ఈ పరీక్షలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పరీక్షలో అత్యధిక మార్కుల వచ్చిన వారికి బహుమతులు అందించనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు దీపిక, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దినేష్, నగర కార్యదర్శి చక్రి, అధ్యక్షులు ఆజాద్, నాయకులు రాజు, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు పేకాటరాయుళ్ల అరెస్ట్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రం శివారులోని గ్రీన్ ఫీల్డ్ మినీ స్టేడియం సమీపంలో పేకాట స్థావరంపై దాడి చేసి ముగ్గురు పేకాటరాయిలను అరెస్టు చేసినట్లు కమ్మర్ పల్లి ఎస్ఐ అనిల్ రెడ్డి గురువారం తెలిపారు. నమ్మదగిన సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేసినట్లు ఆయన తెలిపారు. పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకొని వారి వద్ద నుండి రూ.2వేల 580, పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వివరించారు. పట్టుకున్న ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ అనిల్ రెడ్డి మాట్లాడుతూ జల్సాలు, సరదా కోసం పేకాడుతూ.. కుటుంబాలను నాశనం చేసుకోవద్దన్నారు. పేకాట మూలంగా ఎన్నో కుటుంబాలు వీధిన పడ్డాయని, పేకాట ఆడితే ఎంతటి వారైనా సరే సహించేది లేదని హెచ్చరించారు. ఎవరైనా పేకాట ఆడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-కామారెడ్డి

కుడిక్యాల బాల్ చంద్రం గత వారం రోజుల క్రితం తన కూతురి వివాహం రోజున పెళ్లి పందిరిలోనే గుండెపోటుతో మరణించడంతో కామారెడ్డి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే గోవర్ధన్ వారి ఇంటికి వెళ్లి బాల్‌చంద్రం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యాన్ని నింపారు. ఆయనతోపాటు బీఆర్ఎస్ నాయకులు గేరిగంటి లక్ష్మీనారాయణ, గైని శ్రీనివాస్ గౌడ్ తదితరులున్నారు.



కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

ఎమ్మెల్యేకు ఘన సన్మానం

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రం పరిధిలోని సోమలింగాల గుట్ట శివాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావుకు శివాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు శాలువా పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యేకు అభివృద్ధి కమిటీ సభ్యులు కోరినట్లు తెలిసింది. శివాలయ గుట్ట ప్రాంతంలో అభివృద్ధి పరచేందుకు ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం చేపట్టనున్నట్టు వివరించారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు నిర్మించడానికి ఈ గుట్ట ప్రాంతంలో స్థలాలు కేటాయించి ఆలయ అభివృద్ధికి కృషి చేయనున్నట్టు ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిసింది.



ఎమ్మెల్యేను సన్మానించిన అభివృద్ధి కమిటీ

ఓటు వేసిన ప్రముఖులు



పిట్లం : ఓటు హక్కును వినియోగించుకున్న జుక్కల్ ఎమ్మెల్యే



కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే



కామారెడ్డి : ఓటు హక్కును వినియోగించుకున్న పట్టభద్రులు

నవతెలంగాణ-విలేకరుల బృందం

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పలువురు ప్రముఖులైన పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తమతమ పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేశారు.

ఓటు హక్కును వినియోగించుకున్న ఎమ్మెల్యే..

పిట్లం : ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు గాను మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఏర్పాటు చేసిన పోలింగ్ బూతులో జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు పోలింగ్ సిబ్బందిని ఎన్నికల సరళిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన తన పట్టభద్రుల ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి గెలుపు తథ్యమని అభివర్ణించారు.

ఓటు హక్కు వినియోగించుకున్న చంచల్‌గూడ జైల్ ఎస్పీ..

మండల కేంద్రానికి చెందిన నవాబ్ శివకుమార్‌గౌడ్ రాష్ట్ర రాజధానిలోని చంచల్‌గూడ జైల్ ఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్నప్పటికీ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా పోలింగ్ స్టేషన్‌కు సందర్శించి తమ పట్టభద్రుల కోటాలోని ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆయన వెంట తన చిన్ననాటి మిత్రులు, నాటి తోటి ఉపాధ్యాయులు, శ్రేయోభిలాషులు కలిసి వారి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

ఓటు హక్కును వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్..

కామారెడ్డి : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా గురువారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో (బాలుర) పోలింగ్ బూత్ నెంబర్ 175లో కామారెడ్డి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఓటు వేసిన మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ..

పట్టభద్రుల ఎన్నికల్లో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ తన ఓటు హక్కును కుటుంబ సభ్యులతో కలసి వినియోగించుకున్నారు. పట్టభద్రుల సమస్యలపై ప్రభుత్వంతో పోరాడే వ్యక్తికి ఓటు వేయాలని తెలిపారు.

ఓటు వేసిన మాజీ సర్పంచ్ సాయారెడ్డి..

వర్ని : ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో చందూర్ మండల మాజీ సర్పంచ్ కర్లం సాయరెడ్డి తన ఓటును వినియోగించుకున్నారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులందరూ వందకు వందశాతం ఓటు హక్కును వినియోగించుకోవాలని, తన ఓటుహక్కును చందూర్ మండల ప్రజా పరిషత్ పాఠశాలలో వేసినట్లు తెలిపారు.

నిజాంసాగర్ : ఎమ్మెల్సీ ఓటు హక్కును ఉమ్మడి నిజాంసాగర్ బిజెపి మాజీ మండలాధ్యక్షుడు బోయిని సాయిలు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలిచి శాసనమండలికి వెళ్లడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ఓటు హక్కు వినియోగించుకున్న గ్రాడ్యుయేట్స్..

సదాశివనగర్ : మండలంలోని పలు గ్రామాల గ్రాడ్యుయేట్స్ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఓటు వేసిన అనంతరం సంతోషం వ్యక్తం చేశారు. ఓటు వినియోగించుకున్నట్లు గుర్తులు చూపించారు. ఇందులో వివిధ గ్రామాల వారున్నారు. ఓటు వేసిన వారిలో మొట్టమొదట ఓటు వేసిన సందర్భంగా ఎంతో ఆనందంగా ఉందని వారు తెలిపారు.

మద్నూర్ : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోలింగ్ కేంద్రంలో పట్టభద్రుడు, యువ నాయకుడు సచిన్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకున్న పలువురు..

లింగంపేట్ : ఉమ్మడి పట్టభద్రుల కరీంనగర్ ఆదిలాబాద్ నిజామాబాద్ మెదక్ పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు హక్కును ఎల్లారెడ్డి మాజీ శాసనసభ్యులు జాజాల సురేందర్‌తో పాటు ఆయన అనుచరులు పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. లింగంపేట్ మాజీ జెడ్పిటిసి ఏలేటి శ్రీలత సంతోష్ రెడ్డి, ఏలేటి విజయ జనార్ధన్‌రెడ్డి మొదటి ప్రాధాన్యత ఓటును వినియోగించుకున్నారు. లింగంపేట్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మాజీ చైర్మన్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ ఎదురు గట్ల సంపత్ గౌడ్ తన సతీమణితో వచ్చి పట్టభద్రుల మొదటి ప్రాధాన్యత ఓటును వినియోగించుకున్నారు. పోలింగ్ శాతాన్ని ఎప్పటికప్పుడు ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ మోహన్ రావు లింగంపేట్‌కు చేరుకొని కార్యకర్తలతో పార్టీ నాయకులతో మాట్లాడారు. పోలింగ్ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. బీజేపీ నుంచి డాక్టర్ ప్రొఫెసర్ పైడి ఎల్లారెడ్డి పోలింగ్ కేంద్రాల సమీపంలో చేరుకొని భారతీయ జనతా పార్టీ కార్యకర్త మాట్లాడారు. పోలింగ్ శాతాన్ని అడిగి తెలుసుకున్నారు.



లింగంపేట్ : ఓటు హక్కును వినియోగించుకున్న మాజీ జెడ్పీటీసీ తదితరులు



సదాశివనగర్‌లో..



నిజాంసాగర్‌లో...



వర్నిలో...

ఆలయాల్లో అన్నదానాలు

- **ఘనంగా శివరాత్రి వేడుకలు**

నవతెలంగాణ-విలేకరుల బృందం

శివరాత్రి పండుగ సందర్భాన్ని పురస్కరించుకొని గురువారం శివాలయాల్లో నిర్వాహకులు అన్నదానం నిర్వహించారు.

బోధన్ : బోధన్ పట్టణంలోని ఏకచక్రేశ్వర శివాలయంలో, ఆత్మ లింగేశ్వర ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. శివరాత్రి సందర్భంగా రెండవ రోజు కూడా భక్తులు ఆలయాలకు చేరుకుని ఉపవాస దీక్షలు విరమించి దర్శనం చేసుకున్నారు. దాంతో భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి.

మహాదేవ్ ఆలయానికి ఎమ్మెల్యే పోచారం..

పోతంగల్ : మండలంలోని కారేగాం గుట్టపై వెలిసిన స్వయంభూ మహాదేవ్ ఆలయంలో శివరాత్రి ఉపవాసదీక్ష తరువాత మాజీ ఎంపీ బీబీపాటిల్ అన్నప్రసాద దాత సహాయంతో వితరణ చేశారు. గత వారంరోజులుగా జరిగిన సప్త ముగిసినది. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేకపూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శంకర్ పటేల్, ఏజాజ్ ఖాన్, రాంపటేల్, నాగనాథ్, శివరాజ్, గౌతమ్, రాంబాబు, వెంకటేశ్వర రావు, లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రాజరాజేశ్వర స్వామికళ్యాణం..

తాడ్వాయి : మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా రాజరాజేశ్వర స్వామి, పార్వతి కళ్యాణం అత్యంత వైభవంగా జరిపించారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని కృష్ణాజివాడి గ్రామ సమీపంలోని రాజరాజేశ్వర స్వామి ఆలయంలో భక్తులు హారతులు అభిషేకాలు వంటి ప్రత్యేక మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఉత్సవాలను ఆలయ కమిటీ చైర్మన్ వజపల్లి ప్రభాకర్‌రావు ట్రస్ట్, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుజ్జ రాజు, డిపి రాజిరెడ్డి, భూమ్‌రావు, ఏనుగు చిన్న గంగారెడ్డి, షేర్ బద్దం రమణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. సంతాయిపేట్ గ్రామ సమీపంలోని భీమేశ్వర ఆలయంలో చిట్యాల గ్రామ సమీపంలోని రాజరాజేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో ఆలయ కమిటీ చైర్మన్ ధర్పల్లి ప్రతాపరెడ్డి, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగాయి. భక్తుల సౌకర్యం కోసం కామారెడ్డి బస్టాండ్ నుంచి సంతాయిపేట్ భీమేశ్వర ఆలయం వరకు ప్రత్యేక బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

ముగిసిన మద్దికుంట ఆలయ ఉత్సవాలు..

రామారెడ్డి : మండలంలోని మద్దికుంటలో వెలిసిన శ్రీ స్వయంభు బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని బుధవారం ప్రారంభమైన ఉత్సవాలు గురువారంతో ప్రశాంతంగా ముగిశాయి. బుధవారం రాత్రి ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు, నాటక ప్రదర్శన నిర్వహించారు. గురువారం ఉదయం అగ్నిగుండాలు నిర్వహించారు. పోలీసులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లను చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ లచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేందర్, ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ పూజారులు ప్రభాకర్ స్వామి, గణేష్ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

శివాలయాలలో అన్నదానం

రెంజల్ : శివరాత్రి పండుగను పురస్కరించుకొని మండలంలోని శివాలయాలలో భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రమైన రెంజల్‌తో పాటు సాటాపూర్, కూనేపల్లి, శివాలయాలలో ఉపవాస దీక్ష చేపట్టారు. భక్తులందరికీ అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. గ్రామాభివృద్ధి కమిటీ, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు.

ఘనంగా మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం..

భిక్కనూర్ : మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సంఘం సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులు తమ మొక్కులు, కానుకలు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు భీమ్‌రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, సంఘం సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



పోతంగల్ : పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే

పిట్లం : శివరాత్రి పర్వదినం పండగను పురస్కరించుకొని మండలంలోని శివాలయాలలో శివస్మరణ మారుమోగగా గురువారం ఆయా ఆలయాలలో పెద్ద ఎత్తున మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో శివ భక్తుల నిమిత్తం ఏర్పాటు చేసిన ఉపవాస దీక్షల విరమింప చేయుటకు గాను పెద్ద ఎత్తున నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భాగంగా తిమ్మానగర్ గ్రామ సంగమేశ్వర ఆలయంలో ఆలయ కమిటీ అధ్యక్షులు పల్లె సంగప్ప ఆధ్వర్యంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శివప్ప ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, శ్రీకర్ రెడ్డి, రామాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల కిటకిట..

లింగంపేట్ : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయాల వద్ద ఉపవాస దీక్షలు ఉన్నవారి కోసం భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని మేంగారం శివాలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కొర్పల్ గ్రామ సమీపంలోని రాజరాజేశ్వర ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

సోమలింగాల గుట్ట శివాలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే..

మద్నూర్ : మండల కేంద్ర మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోకి వచ్చే సోమలింగాల గుట్ట శివాలయాన్ని జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. 26న మహాశివరాత్రి ఏకాదశి కాగా ఈనెల 27న ద్వాదశి సందర్భంగా ఆలయం వద్ద భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని గ్రామస్తులు ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో చేపట్టారు.



బోధన్: అన్నదానంలో పాల్గొన్న భక్తులు



తాడ్వాయిలో..



రామారెడ్డిలో..



భిక్కనూర్‌లో..

కలెక్టర్ స్పందించకపోవడం బాధాకరం

- **ఏకపక్షంగా ఓట్లను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి**
- **న్యాయం కోసం హైకోర్టును ఆశ్రయిస్తాం**
- **డాక్టర్ బాలు**

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లాలో జరుగుతున్న టీచర్ ఎమ్మెల్సీ ఓటింగ్ ప్రక్రియలో కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు కళాశాలలు పాఠశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకుల ఓట్లను తొలగించారని కలెక్టర్‌కు ఈనెల 22న ఫిర్యాదు చేసినా స్పందన కరువైందని తెలంగాణ లెక్చరర్ల ఫోరం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బాలు అన్నారు. పిఆర్‌టియు ఉపాధ్యాయ సంఘం తప్పుడు ఫిర్యాదు చేస్తే స్పందించిన అధికారులు, తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలని కోరితే మాత్రం స్పందించలేరని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన విద్యావంతులకు ఓటు వేసే అవకాశం లేకపోవడం బాధాకరమని మండలాల్లో ఉన్న తహసీల్దార్లు ఏ ప్రాతిపదికన ఓటర్లను తొలగించారో అడిగితే కూడా చెప్పే పరిస్థితి లేదన్నారు. అవగాహన లోపంతో అర్హులైనటువంటి వారి ఓట్లను తొలగించడం అప్రజాస్వామ్యమని, దీనికి కారకులైన వారిని చట్ట ప్రకారం శిక్షించాలని అన్నారు. దోషులను గుర్తించి చర్యలు తీసుకోకపోతే హైకోర్టును ఆశ్రయిస్తామని అన్నారు. అన్ని ధ్రువీకరణ పత్రాలు అందజేసిన తర్వాతనే తుది జాబితాలోకి తమ పేర్లు వచ్చాయని తెలిపారు. పోలింగ్ బూత్‌లోకి వెళ్లి అడిగితే మీ ఓట్లు డిలీట్ అయ్యాయని పోలింగ్ ఆఫీసర్లు తెలిపారని ఆవేదన వ్యక్తం చేశారు.

అన్నదానానికి బియ్యం పంపిణీ



అన్నదానం నిర్వహిస్తున్న భక్తులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని సాటాపూర్ శివాలయంలో అన్నదాన కార్యక్రమానికి మాజీ సర్పంచ్ వికార్ పాషా రెండు క్వింటాళ్ల బియ్యాన్ని అందజేశారు. శివరాత్రి పండుగను పురస్కరించుకొని భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా ఆయన రెండు క్వింటాళ్ల బియ్యాన్ని అందజేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. నిర్వాహకులు ఆయనకు ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, కంఠం గంగారం, లచ్చేవార్ నితీన్, నగేష్, కె.సాయిలు, నరేష్, గిరి, మీసాల సాయిలు, అంకం గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల సందర్శన

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలో బిజెపి నాయకులు అభ్యర్థుల గెలుపు కోసం ఓటర్లను వేడుకుంటూ ఓట్లు వేసి బీజేపీ ప్యానెల్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. మద్నూర్ మండల కేంద్రంలో జరిగిన ఎమ్మెల్సీ పోలింగ్‌ను జుక్కల్ మాజీ ఎమ్మెల్యే అరుణా తార మద్నూర్ మండల కేంద్రాన్ని సందర్శించి పోలింగ్ వివరాలను నాయకులను అడిగి తెలుసుకున్నారు.

నారెడ్డి మోహన్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని కాంగ్రెస్ నాయకులు మాజీ జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్‌రెడ్డికి గురువారం జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి కేక్ కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో కాటిపల్లి జైపాల్‌రెడ్డి, కాట్‌మండి సంతోష్ పాటిల్, కోతి లింగారెడ్డి, ఆకిటి స్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ రాంరెడ్డి కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని మోతే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఏలేటి రాంరెడ్డి, మాజీ జెడ్పిటిసి శ్రీలత సంతోష్‌రెడ్డిని లింగంపేట్ కాంగ్రెస్ నాయకులు గురువారం పరామర్శించారు. రాంరెడ్డి తల్లి ఏలేటి భాగవ్వ ఈనెల ఆదివారం మరణించడంతో గురువారం దశదినకర్మ చేశారు. ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అదేవిధంగా మండలంలోని ఆయా పార్టీలకు చెందిన నాయకులు మోతే గ్రామానికి చేరుకొని వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ సిద్ధరామిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, టీపీసీసీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి రఫీ యొద్దీన్, లక్ష్మారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, వంజరి ఎల్లమయ్య, నిజ్జన విఠల్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మండల లారీ అసోసియేషన్ ఏకగ్రీవంగా ఎన్నిక

నవతెలంగాణ-పిట్లం

మండల లారీ అసోసియేషన్ ఎన్నికలు గురువారం సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఏకగ్రీ వంగా నిర్వహించారు. నూతన అధ్యక్షులుగా మీర్జా అవేజ్ బేగ్, ఉపాధ్యక్షులుగా బుగుడాల నవీన్, కార్యదర్శిగా ఇమ్రోజ్, క్యాషియర్‌గా ఆసిఫ్ బేగ్‌ను ఎన్నుకున్నారు. సంఘం సభ్యులుగా సలీం బేగ్, కుద్దూస్, కరీం, రబ్బాని, అహ్మద్, మొయినుద్దీన్, అఫ్రోజ్, సల్మాన్, ముదాసీర్, జలీల్, లక్ష్మణ్, రామకృష్ణ, మహబూబ్, జాఫర్, చందును నియమించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మీర్జా అవేజ్ బేగ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అధ్యక్ష పదవి కట్టబెట్టినందుకు లారీ డ్రైవర్, క్లీనర్ సమస్యలపై నిరంతరం కృషి చేస్తానని అన్నారు. తన ఎన్నిక పట్ల కృషిచేసిన లారీ అసోసియేషన్ యూనియన్ సంఘం సభ్యులకు కృతజ్ఞతాభివందనాలు తెలియజేశారు.



ఎన్నికైన మండల లారీ అసోసియేషన్

బిజెపి మండల ప్రధాన కార్యదర్శిగా ఈర్ల రాజు

నవతెలంగాణ-రెంజల్

బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా ఈర్ల రాజును నియమించినట్టు మండల అధ్యక్షులు గోపికృష్ణ పేర్కొన్నారు. గురువారం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డీ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. ఆయన వెంట మాజీ మండల అధ్యక్షులు చుక్క రాజుగౌడ్, మెట్టు రంజిత్ కుమార్, మేత్రి రాజు, తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్ర ఆలయంవద్ద అన్నదానం

నవతెలంగాణ-మాక్లూర్



మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్ర ఆలయం వద్ద గ్రామ కమిటి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ కమిటీ అధ్యక్షులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరే బ్రహ్మంగారి ఆలయంవద్ద శివ రాత్రి సందర్భంగా రెండు రోజుల పాటు జాతర నిర్వహించి, ఉపవాస దీక్ష పరులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ అన్నదాన కార్యక్రమానికి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు పురుషోత్తం, రవి, ప్రవీణ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ నెట్‌బాల్ ఛాంపియన్‌గా సారంగాపూర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్



జిల్లా సారంగాపూర్ ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న బగ్గలి మహిమ 37వ జూనియర్ నేషనల్ నెట్‌బాల్ ఛాంపియన్ షిప్‌లో సిల్వర్ మెడల్ సాధించింది. హర్యానాలో జరిగిన గేమ్స్‌లో మన తెలంగాణ తరపున ఆడి అతి చిన్న వయసులో ఇంతటి ప్రతిభ చూపి గొప్ప విజయాన్ని సాధించింది. దీనికి కారణం పిటి రంగు కృష్ణంరాజుకు ధన్యవాదాలు తెలిపారు.



డిచ్‌పల్లి: పోలింగ్ కేంద్రం వద్ద కాంగ్రెస్ నాయకులు



మాక్లూర్: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్



ఓటు వేసి వేసి బయటకు వస్తున్న పట్టభద్రులు

టీచర్స్, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతం



డిచ్‌పల్లి: ముగిసిన సమయం.. గేటుకు తాళం.. వెనుదిరిగినన ఓటర్..



ఆర్మూర్: ఓటు హక్కును వినియోగించుకున్న డిసిసిబి చైర్మన్



నవీపేట్‌లో...

నవతెలంగాణ-విలేకరుల బృందం

కంఠేశ్వర్ : నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కాలేజీలోగల 118 పోలింగ్ బూత్‌లో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పుల్ గౌడ్ ఓటు వేశారు. అలాగే సుభాష్ నగర్‌లోని ఎస్ ఎఫ్ఎస్ పాఠశాలలో పోలింగ్ బూత్ 121లో బొచ్చు రాజు నవతెలంగాణ విలేఖరి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

నిజామాబాద్ రూరల్ : రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి నగరంలోని ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో తన ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఓటును వినియోగించుకున్నారు.

బాల్కొండ : ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా మండల కేంద్రంలో ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి అబ్బగోని అశోక్‌గౌడ్ తన ఓటు హక్కును గురువారం వినియోగించుకున్నారు.

ప్రశాంతంగా పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు

మోపాల్ : మండలకేంద్రంలో గురువారం ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగాయి. స్థానిక పోలీస్ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

ముప్కాల్ : నిజామాబాద్, కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్ ఎమ్మెల్సీ పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. పట్టభద్రులు 513 మందికి 418, ఉపాధ్యాయులు 52 మంది ఉండగా 52 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు గట్టి భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు నాయకుడు సంతోష్ కుమార్ తన ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఒకవైపు బీజేపీ, మరోవైపు అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ తమ అభ్యర్థుల విజయంపై ధీమాతో ఉన్నారు.



బాల్కొండ: ఓటు హక్కును వినియోగించుకున్న స్వతంత్ర్య అభ్యర్థి

ఓటు హక్కును వినియోగించుకున్న డిసిసిబి చైర్మన్

(వేల్పూర్)ఆర్మూర్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా మండల కేంద్రంలో డిసిసిబి చైర్మన్ కుంటా రమేష్ రెడ్డి గురువారం తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టభద్రుల కమిట్మెంట్ ఉత్సాహం చూస్తుంటే అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి గెలుపు ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆర్మూర్ : ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టణంలోని పోలింగ్ బూత్‌లో ఓటు హక్కును ఆర్ఆర్ ఫౌండేషన్ డైరెక్టర్ సుచరితారెడ్డి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటు సామాన్యుడి వజ్ర ఆయుధం అని అన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ పోలింగ్

నవీపేట్ : ఉపాధ్యాయ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించగా ప్రశాంతంగా ముగిసింది. బాలుర ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రంలో రెండు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయగా ఉపాధ్యాయ ఓటర్లు 64 కు గాను 59 మంది ఓటు హక్కును వినియోగించుకోగా 92 శాతం పోలింగ్ జరగగా పట్టభద్రుల 810 ఓట్లు ఉండగా 635 మంది ఓటు హక్కును వినియోగించుకొని 78.39శాతం పోలింగ్ జరిగినట్లు అధికారులు తెలిపారు.

డిచ్‌పల్లి : కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాలతో కూడిన కరీంనగర్ శాసన మండలి పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా కొనసాగింది. డిచ్‌పల్లి, ఇందల్ వాయి మండల కేంద్రంలోనే పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా మండలాల పరిధిలోని గ్రామాలకు చెందిన పట్టభద్రులు, ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొన్ని రోజులుగా కాంగ్రెస్, బిజెపి పార్టీల నాయకులు ఓటర్లను కలుస్తూ తమ అభ్యర్థికి ఓటు వేసే విధంగా చూడాలని కోరారు. ప్రజాస్వామ్య ప్రాముఖ్యతను గుర్తి స్తూ, ఓటు కలిగిన ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియో గించుకోవలని సూచించారు. డిచ్‌పల్లి, ఇందల్ వాయి పోలింగ్ కేంద్రాల్లో 4 గంటల 5 నిమిషాలకు గ్రాడ్యుయేట్ రాగా సమ యం అయిపోవడంతో పోలీసులు వారిని లోనికి అనుమతిం చలేదు. ఓటు వేయకుండానే తిరుగు పయనం కాక తప్పలేదు. కార్యక్రమం లో కాంగ్రెస్, బిజెపి పార్టీ మండల అధ్యక్షులు మోత్కురి నవీన్ గౌడ్,లోలం సత్య నారాయణ, నాయ కులు చిన్ రెడ్డి సంతోష్ రెడ్డి, చింతల కిషన్, డాక్టర్ సామల రాజేష్, సంతోష్ రెడ్డి,బైర య్యఎల్ ఐ సి గంగాధర్, లారీ గంగారెడ్డి, కుమ్మరి గంగాధర్, ఆశిష్,బోక్క గంగాధర్,జంగిలి లక్ష్మీ మాజీ సర్పంచ్ కుంట మోహన్ రెడ్డి,నాయిడి రాజన్న,కెపి రెడ్డి, తన్నీర్ వాసు, మోండె అశోక్,తోపాటు తదితరులు పాల్గొన్నారు.



నిజామాబాద్ రూరల్ : ఓటు హక్కును వినియోగించుకున్న రూరల్ ఎమ్మెల్యే

డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ వివరాలు..

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓట్లు మొత్తం 821 కాగా పోలైన ఓట్లు పురుషులు 417, మహిళలు 266. మొత్తం పోలైన ఓట్లు 683. టీచర్స్ ఎమ్మెల్సీ మొత్తం ఓట్లు 41 కి గాను 40 ఓట్లు పోలయ్యాయి. ఇందల్ వాయి మండల కేంద్రంలోని తిర్మన్ పల్లి గ్రామంలోని ఎమ్మెల్సీ పోలింగ్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓట్లు మొత్తం 339, పోలైన ఓట్లు పురుషులు 186, మహిళలు 96, మొత్తం పోలైన ఓట్లు 282. టీచర్స్ ఎమ్మెల్సీ మొత్తం ఓట్లు 15కు గాను 14 ఓట్లు పోలయినట్లు తహసిల్దార్లు ప్రభాకర్, ఎంపిఓ వెంకట్రావు తెలిపారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగినట్లు వారు వివరించారు.



ముప్కాల్: ఓటు హక్కును వినియోగించుకున్న ఓటర్లు

టెంట్లను తీసి వేయించిన పోలీసులు...

ఇందల్ వాయి మండల కేంద్రంలోని తిర్మన్ పల్లి గ్రామంలో ఏర్పాటుచేసిన ఎన్నికల కేంద్రానికి దూరంలో ఏర్పాటు చేసిన టెంట్‌ను పోలీసులు వచ్చి తీసి వేయించారు. ఇంకొక ప్రధాన పార్టీకి చెందిన నాయకులు టేంట్ ను తెప్పించిన వేయకుండా ఉండిపోయారు. ఆయా పార్టీల నాయకులు ఓటు కోసం తమ వాహనాలను పంపించి ఓటర్లను రప్పించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా డిచ్ పల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ కే మల్లేష్, డిచ్ పల్లి, ఇందల్ వాయి ఎస్ హెచ్ ఓ మోహమ్మద్ షరీఫ్, మనోజ్ కుమార్ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పలు పోలింగ్ కేంద్రాలను నిజామాబాద్ ఆర్డిఓ రాజేంద్ర ప్రసాద్, తహసిల్దార్లు ప్రభాకర్, వెంకట్రావు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ కేంద్రాల్లోనే ఉన్నారు.

మెండోర : ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ మండలంలో ప్రశాంతంగా ముగిసింది. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులు బందోబస్తు చర్యలు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాలకు అన్ని వైపులా 100 మీటర్ల దూరంలో బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలను నిషేధించారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, టీచర్లు, గ్రాడ్యుయేట్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

మండలంలోని రెండు పోలింగ్ కేంద్రాల్లో..

గ్రాడ్యుయేట్ ఓటర్లు 388కి 299, టీచర్ ఓటర్లు 38కి 33మంది ఓటు హక్కును వినియోగించుకోగా మొత్తం 426 ఓటర్లకు గాను 332 ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. రెండు పోలింగ్ బూత్‌లలో మొత్తం 77.73 శాతం పోలింగ్ నమోదు అయినట్లు అధికారులు వెల్లడించారు.

బాల్కొండ : మండల కేంద్రంలో గురువారం కరీంనగర్, అదిలాబాద్, నిజామాబాద్, మెదక్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఓటర్లు ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని 147 పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ ముగిసే సమయానికి 77.25 శాతం ఓటింగ్ నమోదైంది. మొత్తం ఓటర్ల సంఖ్య 633, పోలైన ఓట్లు 489, ఓటు హక్కు వినియోగించుకున్న పురుషులు 318, స్త్రీలు 171, అలాగే టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటింగ్ శాతం అత్యధికంగా నమోదైంది .మొత్తం 28 ఓట్లకు గాను 28 ఓట్లు పోలయ్యాయి, దీంతో 100శాతం ఓటింగ్ నమోదైందని తహశీల్దార్ శ్రీధర్ తెలిపారు. మొత్తం పోలింగ్ ప్రక్రియ తహశీల్దార్ శ్రీధర్ ఆధ్వర్యంలో నిబంధనలకు అనుగుణంగా ప్రశాంతంగా కొనసాగింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బాల్కొండ ఎస్ఐ బి. నరేష్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు నిర్వహించారు.

కమ్మర్‌పల్లి : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం జరిగిన నిజామాబాద్-కరీంనగర్-ఆదిలాబాద్-మెదక్ నియోజకవర్గ ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఓటర్లు ఉత్సాహంగా పెద్ద ఎత్తున పాల్గొని ఓటుహక్కును వినియోగించుకున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలింగ్ కేంద్రం 97 లో ఉపాధ్యాయ పోలింగ్ కేంద్రంలో 61 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా 56 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో 50 మంది పురుష ఓటర్లకు గాను 45 మంది, 11మంది మహిళ ఓటర్లకు గాను 11మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తంగా మండలంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 91.80శాతం ఓటింగ్ నమోదు అయినట్లు అధికారులు తెలిపారు. 151 పోలింగ్ కేంద్రంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ జరగగా మండలంలో 1021మంది పట్టభద్రుల ఓటర్లు ఉండగా అందులో 771 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో 691మంది పురుష ఓటర్లు ఉండగా 515 మంది ఓటు హక్కును వేయించుకున్నారు. 330మంది మహిళ ఓటర్లకుగాను 256 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తంగా మండలంలో పట్టభదుల నియోజకవర్గంలో 75.5శాతం ఓటింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. పోలింగ్ కేంద్రాలను భీంగల్ సిఐ సత్యనారాయణ గౌడ్, తహసల్దార్ ఆంజనేయులు, కమ్మర్‌పల్లి ఎస్ఐ అనిల్‌రెడ్డి పోలింగ్ కేంద్రాలను సందర్శించి పరిశీలించారు.

సమయం ముగిసిన తర్వాత కొనసాగిన పోలింగ్...

ఉదయం 8గంటలకు ప్రారంభమైన పోలింగ్ మందకొడిగా కొనసాగగా, మధ్యాహ్నం తర్వాత పుంజుకుంది. దీంతో పోలింగ్ సమయం నాలుగు గంటలు దాటిన తర్వాత కూడా పోలింగ్ కేంద్రంలో పెద్ద సంఖ్యలో పట్టభద్రులు ఓటర్లు బారులు తీరారు. నాలుగు గంటల్లోపు పోలింగ్ కేంద్రంలోకి చేరుకున్న పట్టభద్రులు అందరికీ అధికారులు ఓటు వేసే అవకాశాన్ని కల్పించారు. సాయంత్రం 6.10గంటల వరకు పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ కొనసాగింది. బిజెపి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలేటి మల్లికార్జున్ రెడ్డి పట్టభద్రులతో కలిసి క్యూలైన్లో నిలబడి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

కంఠేశ్వర్ : నిజామాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలు ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా, పటిష్ట బందోబస్తు నడుమ శాసన మండలి ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 8 గంటలకు ప్రారభంభమై సాయంత్రం 4 గంటల వరకు కొనసాగింది. ఉదయం 10 గంటలకు వరకు నగరంలో మందకొడిగా సాగిన పోలింగ్ తరువాత ఊపందుకుంది. నగరంలోని కంఠేశ్వర్ పాలిటెక్నిక్ కళాశాలలో, సీఎస్ఐ స్కూల్, ఎస్ఎఫ్ఎస్ పాఠశాల, నిర్మల హృదయ పాఠశాలలో, ముబారక్ నగర్ తదితర చోట్ల పోలింగ్ బూత్‌లలో ఉదయం నుంచి సందడి నెలకొన్నది. కొత్త ఓటర్లు తమ ఓటు వేసిన తరువాత సెల్ఫీలు దిగుతూ ఆనందం వ్యక్తం చేశారు. కొద్ది రోజులుగా ఎన్నికల ప్రచారం ముమ్మరంగా చేసిన వివిధ రాజకీయ పార్టీల కార్యకర్తలు, నాయకులు గురువారం సైతం అదే ఒరవడి కొనసాగించారు. పట్టభద్రులు, ఉపాధ్యాయులు, పట్టభద్ర గృహిణులు, యువ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఎక్కువ ఆసక్తి చూపారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

మాక్లూర్ : మండలంలోని మాదాపూర్ ప్రైమరీ పాఠశాలలో బూత్‌లు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలను కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు గురువారం పరిశీలించారు. ఆయన వచ్చే సమయానికి మహిళా ఓటర్లు బారులు తీరి ఎండలో సైతం ఉన్నారు. సంబంధిత అధికారులతో ఆయన మాట్లాడి తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఓటింగ్ నిర్వహించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. పోలింగ్ కేంద్రం వద్ద ఓటు హక్కు వినియోగించుకోవటానికి వస్తున్న పట్టభద్రులకు ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి పోలింగ్ స్లిప్ అందజేశారు. మండలంలోని మొత్తం పట్టభద్రుల ఓటర్లు 789కి గాను, 629 పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 382, మహిళలు 247 ఉన్నారు. టీచర్స్ ఎమ్మెల్సీకి 79కి గాను 76ఓట్లు పోలయ్యాయి. పురుషులు 50, మహిళలు 26మంది తమ ఓట్లను వినియోగించుకున్నారు.

నేడు సిఎస్, డిఓల సమావేశం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

2024-25 విద్యా సంవత్సరం ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణ కోసం చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారుల సన్నాహక సమావేశం శుక్రవారం పదిన్నర గంటలకు నిజామాబాద్ ప్రభుత్వ బాలుర (ఖిల్లా) జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్ విద్యా అధికారి తిరుమలపూడి రవికుమార్ గురువారం తెలిపారు. మార్చి 5వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణ కోసం చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు, కస్టోడియన్ విధులు కేటాయించ బడిన అధ్యాపకులు సమావేశానికి అందరూ సకాలంలో హాజరుకావాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి ఆదేశించారు. కలెక్టర్‌తోపాటు జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు ఈ సమావేశంలో పాల్గొంటారని జిల్లా ఇంటర్ విద్యా అధికారి తెలిపారు.

ముగిసిన శివరాత్రి మహోత్సవాలు

నవతెలంగాణ-ముప్కాల్

మండల కేంద్రంలో వెలసిన పడిలేచిన మర్రిచెట్టు వృక్షం 'శ్రీ మహా శివలింగేశ్వర స్వామి'తో పాటు మండలంలోని కొత్తపల్లి, వేంపల్లి గ్రామాల్లోని స్వామి వారి ఆలయాల్లో మహా శివరాత్రి వేడుకలను ఆయా గ్రామాభివృద్ధి కమిటీ, ఆలయ కమిటీ సభ్యులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. చివరి రోజైన గురువారం భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ ఉత్సవాలు ఘనంగా ముగియడంతో కమిటీ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

బీఆర్ఎస్ ఓట్లు బిజెపికి డైవర్ట్..?

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఓటింగ్ సరళిని పరిశీలిస్తే ఆయా మండల కేంద్రాల తో పాటు గ్రామాల్లో ఉన్న బీఅర్ఎస్ పార్టీకి చెందిన పట్టభద్రుల ఓట్లు బిజెపికి డైవర్ట్ అయినట్లు స్పష్టమైంది. డైరెక్ట్‌గా కాకున్నా ఇన్ డైరెక్ట్‌గా సపోర్ట్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి మద్దతు ప్రకటించకున్న, తమ పార్టీ నుండి అభ్యర్థిని బరిలోకి దించకుండా ఉండిపోవడంతో నిరాశలో ఉన్న కార్యకర్తలు ఇదే అదునుగా భావించి లోపాయి కారీగా బిజెపికు చెందిన ఎమ్మెల్సీ అభ్యర్థికి ఓటు వేసినట్లు తెలుస్తోంది. ఏ ఇతర పార్టీకి వేసుకున్న తమకు ఇబ్బంది లేదని, కానీ కాంగ్రెస్ అభ్యర్థిని మాత్రం ఓటు వేయవద్దని ముందస్తుగానే నిర్ణయించుకున్నట్లు మండలంలో గుసగుసలు వినపడుతున్నాయి. కాంగ్రెస్, బిజెపి పార్టీలకు చెందిన నాయకులు సైతం పట్టభద్రులను కలుస్తూ తమ అభ్యర్థికి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఏ మండలంలో ఏ పార్టీకి ఎక్కువ ఓట్లు వచ్చాయో కొద్ది రోజుల్లోనే తేటతెల్లం కానుంది. హాయ్ ఆ పార్టీ నాయకులు మాత్రం తమ అభ్యర్థికి ఎక్కువ ఓట్లు వచ్చాయని ధీమా వ్యక్తం చేస్తున్నారు. గతంలో జరిగిన శాసనసభ, లోక్ సభ ఎన్నికల సమయంలో ఆయా పార్టీలకు చెందిన నాయకులు సైతం ఇదే రకంగా వ్యవహరించినట్లు గుసగుసలు లేకపోలేదు. ఇప్పుడు సైతం గతంలో జరిగిన విధంగానే నేడు జరిగినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ఇలా డైవర్ట్ పాలిటిక్స్ ఎవరి కొంప ముంచుతుందో..? ఎవరిది పైచేయి అవుతుందో త్వరలోనే బయట పడుతుంది. బిజెపి చాప కింద నీరులా ప్రచారం చేసి దూసుకు పోయినట్లు తెలుస్తోంది. ఈ నెల 24 వరకు స్తబ్దుగా ఉన్న కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొని క్యాడర్ కు దిశా నిర్దేశం చేయడంతో రెండు, మూడు రోజుల్లోనే కాంగ్రెస్ పార్టీ నాయకులు సవాల్‌గా తీసుకుని ఓటర్లను కలుస్తూ తమ పార్టీ అభ్యర్థి గెలిచేందుకు శాయశక్తులా కృషి చేశారు. ముందు నుండి ఇదే ఒరవడిని ప్రదర్శించి ఉంటే ఇంకా బాగుండేదనే చర్చ లేకపోలేదు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు సవాల్‌గా నిలవనున్నాయి.

శివాలయం వద్ద అన్నదానం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి



మండల కేంద్రంలోని శివాలయం వద్ద వీడీసీ ఆధ్వర్యంలో అన్నదానం సత్రం నిర్వహించారు. ప్రతి సంవత్సరం లాగానే గ్రామంలో శివ భక్తులు అదరూ శివరాత్రి ఉపవాసంతో పూజలు నిర్వహించగా గురువారం సర్వసమాజ్ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జక్రాన్ పల్లి గ్రామ ప్రజలు, వివేక్ నగర్ తండా ప్రజలు పాల్గొన్నారు.

రహదారులపై పంటలను ఆరబెట్టొద్దు

- ఏసీపీ వెంకటేశ్వర రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

రహదారులపై పంటలను ఆరబెట్టకూడదని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ వెంకటేశ్వర్ రెడ్డి గురువారం రైతులకు సూచించారు. ఆలూర్ మండల కేంద్రంలో సొసైటీ మాజీ చైర్మన్ కళ్లెం భోజరెడ్డి, మాజీ సర్పంచ్ కళ్లెం మోహనరెడ్డి, సీడ్ కంపెనీ ప్రతినిధులు, రైతులు కలిసి మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసీపీ రైతులతో మాట్లాడి పంట సాగు విధానాలపై వివరాలు అడిగి, అవసరమైన సూచనలు అందించారు. ముఖ్యంగా, రహదారులపై మొక్కజొన్న ఆరబెట్టడం వల్ల వాహనదారులకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని రైతులకు హెచ్చరించారు. అనవసరమైన ప్రమాదాలను నివారించేందుకు పంటను రోడ్లపై కాకుండా ఇతర ప్రత్యామ్నాయ స్థలాల్లో ఆరబెట్టాలని సూచించారు. కార్యక్రమంలో సీడ్ కంపెనీ ప్రతినిధులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వర రెడ్డి

ఆత్మహత్యకు పాల్పడిన వివాహిత మృతి

నవతెలంగాణ-బోధన్

వర్నకట్న వేధింపులతో బోధన్ పట్టణంలోని ద్యాకంగల్లీకి చెందిన జమేదార్ రజిత ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడింది. హైదరాబాద్ లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. బోధన్ సీఐ వెంకటనారాయణ తెలిపిన వివరాల ప్రకారం జమేదార్ రజితకి 15 ఏండ్ల క్రితం బోధన్ పట్టణంలోని ద్యాకంగల్లీకి చెందిన జమేదార్ సాయిలుతో వివాహమైంది. వారికి సాహితి(14), శ్రీనిధి (12) ఉన్నారు. భర్త సాయిలు, అత్తలు లక్ష్మి, గంగమణి, బావ నాగేశ్, మరిది రాజు కొన్ని నెలలుగా అదనపు కట్నం కోసం వేధించగా రజిత తండ్రి పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టి సముదాయించారు. మళ్ళీ అత్తింటి వారు అదనపు కట్నం కోసం వేధించగ ఈ నెల 24న రాత్రి తన ఇంటిలో కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకుంది. మంటలు చూసిన భర్త, కాలనీ వాసులు ఆమెను చికిత్స కోసం బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుండి మెరుగైన చికిత్స కొరకు హైదరాబాద్ లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి తండ్రి మీసాల సాయిలు ఫిర్యాదు మేరకు మృతురాలి భర్త , అత్తింటి వారిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఢిల్లీ జాతీయ సదస్సుకు తరలిన నాయకులు

నవతెలంగాణ-బోధన్



బీజేపీ, ఆర్ఎస్ఎస్ ఫాసిస్టు, కార్పోరేట్, మతోన్మాద విధానాలను వ్యతిరేకిస్తూ శుక్రవారం ఢిల్లీలో సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ సదస్సుకు బోధన్ నుంచి ఆ పార్టీ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు గురువారం తరలివెళ్లారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కామ్రేడ్ వి.ప్రభాకర్, రాష్ట్ర నాయకులు పి.రామకృష్ణ, ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి బి.దేవారం, సహాయ కార్యదర్శి ఆర్.రామేష్, జిల్లా నాయకులు బి.మల్లేష్, సారా సురేష్, గుమ్ముల గంగాధర్, వి.సత్తెవ్వ, పిడిఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు నరేందర్, పిఓడబ్ల్యు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వి.గోదావరి, జిల్లా ఉపాధ్యక్షురాలు బి.నాగమణి, ఎం.డి.అనిస్, ఏఐయుకెఎస్ జిల్లా సహాయ కార్యదర్శి బి.బాబాన్న, టీయూసీఐ నాయకులు ఎ.అరవింద్, తదితరులు ఢిల్లీకి వెళ్లారు.

విద్యుత్ బల్బ్ నుంచి చేతిలో ఇమిడిపోయిన సెల్ ఫోన్ వరకు ప్రతిదీ శాస్త్రవేత్తల నిరంతర పరిశోధనల ఫలితంగానే మనకు అందుబాటులోకి వచ్చాయి. నిత్యజీవితంలో సైన్స్ ఉపయోగం అంతా ఇంతా కాదు. మనం వాడే ప్రతి వస్తువు పరిశోధనల ఫలితమే. ఏండ్ల తరబడి ఎందరో శాస్త్రవేత్తలు శోధించి సాధించిన ఫలాలను మనం అనుభవిస్తున్నాం. ప్రఖ్యాత భారత భౌతిక శాస్త్రవేత్త సివి రామన్ 1928 ఫిబ్రవరి 28 రామన్ ఎఫెక్ట్ను వెలుగులోకి వచ్చిన సందర్భంగా జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం నిర్వహిస్తారు.

నవతెలంగాణ-ఆర్మూర్

శోధిస్తే.. అద్భుతాలే

- భవిష్యత్తు ఆవిష్కరణలకు విద్యార్థుల్లో ప్రేరణ
- నేడు జాతీయ సైన్స్ దినోత్సవం



అవసరం ఉందని పరిశోధనలు ప్రారంభం కావలసింది విశ్వవిద్యాలయాల్లో కాదని, పాఠశాల స్థాయి నుంచే అడుగులు పడాలని భావించారు. పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఇన్స్పైర్ కార్యక్రమాల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొంటూ తమ మేధస్సుకు పదును పెడుతున్నారు. ప్రతి ఏటా పాఠశాల స్థాయిలో మండల, జిల్లా స్థాయిలో జరిగే కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొంటున్నారు.

నేడు 20వేల మంది విద్యార్థులు....

నేడు హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంల్లో నిర్వహించనున్న జాతీయ సైన్స్ డే వేడుకలకు డిఆర్డిఓ, హెరో నాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా, కలాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ యూత్ ఎక్సెన్స్ విస్తృత ఏర్పాట్లను చేసింది. భవిష్యత్తు ఆవిష్కరణలకు విద్యార్థుల్లో ప్రేరణ కలిగించేలా నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌లో 200 స్టాళ్లను ఏర్పాటు చేయగా, 20వేల వరకు విద్యార్థులు ఈ సైన్స్ డే వేడుకల్లో పాల్గొంటున్నారు.

శాస్త్ర సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులతో...

విద్యార్థులు శాస్త్ర సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను గమనించాలి. ప్రకృతిలో జరుగుతున్న సంఘటన వెనుకల ఉన్న శాస్త్రీయత అన్వేషించాలి. సుస్థిరాభివృద్ధి కోసం నూతన ఆవిష్కరణలు చేసి ప్రకృతి వనరులను సంరక్షించే సాంకేతికతను అభివృద్ధి చేయాలి. సివి రామన్ తర్వాత ఈ రంగంలో నోబెల్ బహుమతి పొందలేదు. విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేసి ప్రపంచంలో అగ్రగామిన నిలబడాలి. సాంకేతికతను వినియోగించుకుంటున్నప్పుడు విచక్షణ నైతికత సామాజిక బాధ్యతతో వ్యవహరించాలి. సైబర్ నేరాల పట్ల అప్రమత్తతో ఉండాలి. ప్రకృతిలో జరుగుతున్న సంఘటనలకు కార్యకారణ సంబంధాన్ని వెతకాలి. మూఢనమ్మకాలను విడనాడాలి. నూతన ఆవిష్కరణలను చేసి ప్రభుత్వాలు అందించే ప్రోత్సాహకాలను పొందాలి. సైన్స్ సంబంధిత కార్యక్రమాలలో విస్తృతంగా పాల్గొనడం వల్ల శాస్త్రీయ జిజ్ఞాస పెంపొందించబడుతుంది

జిల్లా కేంద్రంలో సైన్స్ టాలెంట్ టెస్ట్..

జిల్లాస్థాయి భౌతిక రసాయన శాస్త్ర టాలెంట్ టెస్ట్ మాణిక్ భవన్ పాఠశాలలో ఇటీవల నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ మండలాల మొదటి మూడు స్థానాలు సంపాదించిన విద్యార్థులు టెస్టులో పాల్గొన్నారు. జిల్లాలో గల 33 మండలాల విద్యార్థులు పాల్గొనగా వారిలో రాష్ట్రస్థాయికి ముగ్గురు విద్యార్థులు ఎంపికఅయ్యారు. వారిలో పి హర్షిత జెడ్ పి హెచ్ ఎస్ మెండోరా మొదటి స్థానం, ద్వితీయ స్థానంలో పి ఆశని జడ్.పి.హెచ్.ఎస్ మెండోరా, గతన్ వార్ జెడ్పిహెచ్ఎస్ ఆర్మూర్ గెలుపొందారు. విద్యార్థులందరికీ మెమెంటోలు, సర్టిఫికెట్లు అందుకున్నారు.

సివి రామన్ ఎఫెక్ట్..

సముద్రపు నీటిపై సూర్యకాంతి పడినప్పుడు ఆ కాంతి లోని నీలం రంగు ఎక్కువగా పరిక్షేపం చెంది మన కంటికి చేరడం వల్లనే సముద్రం నీలిరంగులో కనిపిస్తుందని భౌతిక శాస్త్రవేత్త సి.వి.రామన్ సిద్ధాంతీకరించాడు. ఇలా ద్రవాలపై పడిన కాంతి కిరణాలు ఎలా పరిక్షేపం చెందుతాయో తెలిపే పరిశోధన ఫలితాన్ని సివి రామన్ ఎఫెక్టా నేషనల్ సైన్స్ డేగా నిర్వహిస్తున్నారు.

అబ్దుల్ కలాం ఆలోచనల నుంచి పుట్టినదే ఇన్స్పైర్...

దేశంలో శాస్త్రవేత్తల కొరత తీవ్రంగా ఉన్న తరుణంలో దివంగత అబ్దుల్ కలాం తీవ్రంగా ఆలోచించారు. శాస్త్రవేత్తల కొరత తీర్చుడానికి చర్యలు తీసుకోవలసిన

ఉపాధ్యాయులు బోధనలను ప్రయోగాల ద్వారా వివరించాలి

గంగా కిషన్, జిల్లా సైన్స్ అధికారి-నిజామాబాద్.



ఉపాధ్యాయులు, విద్యార్థులు శాస్త్రీయ జిజ్ఞాసలను పెంపొందించడానికి తమ బోధనలు ప్రయోగాలు ద్వారా వివరించినట్లయితే విద్యార్థులను ప్రశ్నించే సామర్థ్యం పెంపొందుతుంది. తద్వారా విద్యార్థులు ఆవిష్కరణలవైపు పయనించే అవకాశం ఉంటుంది. సైన్స్ సంబంధిత కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొని విద్యార్థులు స్వేచ్ఛగా ఆలోచించే అవకాశాలను పెంపొందించాలి. ప్రకృతిలో జరుగుతున్న సంఘటనల పట్ల శాస్త్రీయ కారణాలు అన్వేషించే విధంగా ప్రోత్సహించాలి. విజ్ఞాన విహారయాత్ర ద్వారా విద్యార్థుల్లో నూతన ఆవిష్కరణ వైపు పయనించే విధంగా ప్రోత్సహించవచ్చు. అందుబాటులో ఉన్న సైన్స్ మ్యూజియంలో సైన్స్ సెంటర్లను సందర్శించే అవకాశాన్ని కలిగించవచ్చు.

ప్రయోగాలతో బోధన చేస్తూ...

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ కు చెందిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు పసుపుల రఘునాథ్ ఎక్కడ పాఠశాలలో పనిచేసిన సైన్స్ ఫెయిర్‌లో పిల్లలతో వివిధ రకాల ప్రయోగాలను తయారు చేయించి ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు. వారికి ఆయన గైడ్ గా వ్యవహరిస్తున్నారు. కఠినమైన పాఠ్యాంశాలను సులభంగా బోధించి విద్యార్థులకు సదా గుర్తుండేలా చేస్తున్నారు. గతంలో పనిచేసిన ఆలూరు మండలంలోని రామచంద్ర పల్లి, వేల్పూర్ మండలంలోని లక్కోరా, మండలంలోని సుర్బిరియాల్లో, ప్రస్తుతం పని చేస్తున్న వేల్పూర్ మండలంలోని అంక్సాపూర్ గ్రామ విద్యార్థుల భవితకు పాటుపడుతున్నాడు.



సైన్స్‌ఫెయిర్‌లో ప్రయోగాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

నవీపేట్‌లో బైక్ చోరీ

నవతెలంగాణ-నవీపేట్

మండల కేంద్రంలోని సరస్వతి నగర్ లో బుధవారం అర్ధరాత్రి నరసింహ స్వామికి చెందిన బైక్ నెంబర్ టీఎస్ 16 ఇఎన్ 9578 గుర్తు తెలియని దుండగులు చోరీ చేసినట్లు బాధితుడు నరసింహస్వామి గురువారం తెలిపారు. మండల కేంద్రంలోని సరస్వతి నగర్ లో అద్దెకు నివాసం ఉంటున్న నరసింహస్వామి గురువారం ఉదయం చూడగా బైక్ కనిపించకపోవడంతో సీసీ కెమెరా పుటేజీ గమనించగా ఇద్దరు దుండగులు బైక్ ను అపరించినట్లు తెలిసింది. ఈ విషయమై గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత కొంతకాలంగా మండల కేంద్రంలో బైక్ దొంగతనాలు తరచుగా జరుగుతున్నాయి. ఈ విషయంలో పోలీసులు దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

విజయోత్సవ ర్యాలీలకు సిద్ధం అవ్వండి

- ఎమ్మెల్యే ధన్‌పాల్



పోలింగ్ స్లిప్ అందిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సి ఎన్నికల సందర్భంగా నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో ఓటింగ్ జరుగుతున్న పోలింగ్ కేంద్రాలను అర్బన్ శాసనసభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ సందర్శించారు. పోలింగ్ కేంద్రాలకు ఓటు హక్కు వినియోగించుకోవడానికి విచ్చేస్తున్న ఉపాధ్యాయులకు, గ్రాడ్యుయేట్లకు ఎమ్మెల్యే పోలింగ్ స్లిప్స్ అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మేధావులు, ఉద్యోగులు, పట్టభద్రులు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పబోతున్నారని అన్నారు. ఓటింగ్ సరళి, పోలింగ్ శాతాన్నిచూస్తే ఓటర్లు బిజెపి బలపరిచిన అభ్యర్థులకే జై కొట్టినట్లు సాంకేతాలు వస్తున్నాయని అన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలకు, మోసపూరిత హామీలకు, నిరుద్యోగులకు, ఉద్యోగులకు చేసిన మోసానికి మేధావి వర్గం తగిన బుద్ధి చెప్పిందని నమ్ముతున్నామని తెలిపారు. నిరుద్యోగుల పక్షాన, ఉపాధ్యాయుల పక్షాన మండలిలో ప్రశ్నించే గొంతుకలు బిజెపి అని తెలంగాణ ప్రజలు బలంగా నమ్ముతున్నారని ధీమా వ్యక్తం చేశారు. మార్చ్ 3న జరగబోయే లెక్కింపులో బిజెపి రెండు ఎమ్మెల్సి స్థానాల్లో ఘన విజయం సాధించబోతుందని అని ధీమా వ్యక్తం చేశారు. బిజెపి శ్రేణులు, కార్యకర్తలు విజయోత్సవ ర్యాలీలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

ఫ్లెక్సీల చించివేతపై ఫౌండేషన్ సభ్యుల ఆగ్రహం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని సిద్దుల గుట్టపై మహాశివరాత్రి సందర్భంగా ఈఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీ చించివేతపై ఫౌండేషన్ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని ప్రెస్ క్లబ్ భవనంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీసీ ఎస్సీ ఎస్టీ సభ్యులు అంతా కలిసి ఈ ఆర్ ఫౌండేషన్ స్థాపించి సేవా కార్యక్రమాలు చేస్తున్నామని అన్నారు. మాపై కక్షపూరితంగా కొందరు ఇలా చేయడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో అర్గుల్ సురేష్, శ్రీకాంత్, జిత్తు, రాజ్ కుమార్, రాంప్రసాద్, శేఖర్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.



బోధన్ మండలంలో..



జుక్కల్ మండలంలో..



లింగంపేట్ మండలంలో..

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

- సాలూర మండలంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన సబ్ కలెక్టర్

నవతెలంగాణ-విలేకరుల బృందం

బోధన్ :పట్టభద్రుల, టీచర్ల ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం బోధన్ డివిజన్‌లో ప్రశాంతంగా ముగిసాయి. బోధన్ డివిజన్‌లో 5037 పట్టభద్రుల ఓట్లు ఉండగా, టీచర్ల ఓట్లు 701 ఉన్నాయి. సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ముగిసే సమయానికి మొత్తం 701 మంది టీచర్లు, 660 మంది పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 94.15శాతం ఎమ్మెల్సీ పోలిగ్ శాతం నమోదయింది. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పట్టణ సీఐ వెంకటనారాయణ, రూరల్ సీఐ విజయ్‌బాబు బందోబస్తు ఏర్పాటుచేశారు. అత్యవసర వైద్య సేవల కోసం సాలూర పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ రాజ్ కుమార్ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

దోమకొండ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత బాలుర పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఓటర్లు ఉత్సాహంగా ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి నితిన్, తహసిల్దార్ సంజయ్ రావు తెలిపిన వివరాల ప్రకారం దోమకొండ మండల ఎమ్మెల్సీ పట్టభద్రులు మొత్తం 498 మంది ఓటర్లు, ఉపాధ్యాయ ఓటర్లు 57 మంది ఉన్నారని మొత్తం 83శాతం పోలింగ్ నమోదయిందని తెలిపారు.

పిట్లం : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు గాను పిఎస్ నంబర్ 112లో 49 మంది టీచర్‌లను అలాట్ చేయగా 44 మంది టీచర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవడంతో 90శాతం పోల్ అయినట్లు ఎన్నికల పర్యవేక్షకులు వేణుగోపాల్ తెలిపారు. కాగా పిఎస్ నంబర్ 167 బూతులో 487 మంది పట్టభద్రులను కేటాయించడంతో 402 మంది తమ ఓటు హక్కును వియోగించుకోవడంతో 82.50 శాతం ఓట్లు పోల్ అయినట్లు ఆయన తెలిపారు.

భిక్కనూర్ :మండలంలో ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, అల్లర్లు జరగకుండా పోలీస్ శాఖ భారీ బందోబస్తు, పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేశారు. బిజెపి నాయకులతో పోలీసులకు స్వల్ప వాగ్వాదం జరిగినా.. గొడవ సద్దుమణిగింది. పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు తహసిల్దార్ శివ ప్రసాద్, ఎంపీడీవో రాజ్ కిరణ్ రెడ్డి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సిఐ సంపత్ కుమార్, ఎస్సై ఆంజనేయులు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

వర్ని :చందూర్ మండలంలో గ్రాడ్యుయేట్ 84.65శాతం, ఉపాధ్యాయులు 100శాతం ఓట్లు పోలయ్యాయి. మోస్రా మండలంలో గ్రాడ్యుయేట్ ఓటర్లు 80శాతం, ఉపాధ్యాయుల 100శాతం ఓటు హక్కు వినియోగించుకున్నట్టు తహసీల్దార్ శాంత కుమారి తెలిపారు. రుద్రూర్ మండలంలో గ్రాడ్యుయేట్ 82శాతం, ఉపాధ్యాయుల 100శాతం, వర్ని మండలంలో గ్రాడ్యుయేట్ 85శాతం, ఉపాధ్యాయుల 95శాతం ఓటు హక్కు వినియోగించుకున్నట్టు అధికారులు తెలిపారు.

తాడ్వాయి :మండల కేంద్రంలో పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్లు తహసిల్దార్ రహీముద్దీన్ తెలిపారు. పట్టభద్రులకు సంబంధించి 671 ఓట్లకు గాను 569 పోలై 84.7 శాతం పోలయ్యాయని, 157 మహిళలు కాగా 412 పురుషులు ఓటు హక్కు వినియోగించుకున్నారని.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 44 ఓట్లుండగా 41 ఓట్లు పోలై 93 శాతం కాగా 13 మంది మహిళలు 28 మంది పురుషులు ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తెలిపారు. ఓటర్లు సెల్ ఫోన్లు వెంబడి తీసుకొని రాగా పోలింగ్ కేంద్రాలకు అనుమతించలేదు. దీంతో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి సెల్ ఫోన్లను భద్రపరిచారు. ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, మండల పంచాయతీ అధికారిణి సవితా రెడ్డి పోలింగ్ సరళిని పర్యవేక్షించారు. స్థానిక పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నాగిరెడ్డిపేట్ :మండల కేంద్రంలో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. 350 మంది పట్టభద్రులకు గాను 290 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 21 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా 20 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు ఎన్నికల ప్రొసీడింగ్ అధికారి శ్రీహిత్ తెలిపారు.

మద్నూర్ :మండల కేంద్రంలో టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికకు 93.87 శాతం, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు 75.29శాతం పోలింగ్ నమోదైనట్లు మండల తహసిల్దార్ ఎండి ముజీబ్ తెలియజేశారు. టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికకు మద్నూర్ మండలంలో మొత్తం ఓటర్లు 49 మంది ఉండగా 46 మంది టీచర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు మొత్తం ఓటర్లు 417 మంది ఉండగా వీరిలో 314 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

జుక్కల్ :మండల కేంద్రంలో గ్రాడ్యుయేషన్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన రెండు పోలింగ్ బూతులు ఏర్పాటు చేశారు. గ్రాడ్యుయేషన్ ఓటర్లు మొత్తం 347 ఓటర్లు ఉండగా, అందులో మహిళలు 64, పురుషులు 283 మంది ఓటర్లు ఉన్నారు. ఉపాధ్యాయులకు సంబంధించిన మొత్తం ఓటర్లు 17 మంది ఉండగా వారిలో మహిళలు 15 మంది, పురుషులు 2 ఉన్నారు. ఎన్నిక సరళిని ఎప్పటికప్పుడు జుక్కల్ తహసీల్దార్ హిమబిందుతోపాటు జుక్కల్ ఎంపీడీవో శ్రీనివాస్ మానిటరింగ్ చేశారు. పోలింగ్ జరుగుతున్న ప్రాంతం వద్ద ప్రశాంతంగా ఎన్నికలు జరిగే విధంగా వారు ఎన్నికల పరిసర ప్రాంతంలో ఉండి ఓటర్లకు తగు సూచనలు చేశారు.

పోతంగల్ :మండలంలో ఎం.ఎల్.సి. ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. పోతంగల్ పోలింగ్ కేంద్రంలో 12 ఉపాధ్యాయ ఓటర్లు, 259 పట్టభద్రుల ఓటర్లు ఉన్నారు. 100శాతం ఉపాధ్యాయ ఓటర్లు, 82శాతం పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.



సదాశివనగర్ మండలంలో..

రెంజల్ :మండల కేంద్రమైన రెంజల్ జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన పట్టభద్రుల ఎన్నికల్లో సుమారు 90 శాతం ఓట్లు పోలైనట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. మండలంలో మొత్తం పట్టభద్రులు 425 ఓటర్లు ఉండగా, 379 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 262 మంది పురుషులు, 117 మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ జరిగింది. ఉపాధ్యాయులు 13 మందికి గాను, 13 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

నిజాంసాగర్ :మండలంలో ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు ముగిసాయని మండల రెవెన్యూ అధికారి బిక్షపతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొత్తం టీచర్ ఓట్లు 9 ఓట్లకు గాను 9 (100 శాతం) మంది ఓటు వేశారని, గ్రాడ్యుయేట్‌లు 190 ఓట్లకు గాను 153 (80 శాతం) మంది ఓటు వేశారని ఆయన తెలిపారు. మహ్మద్‌నగర్ మండలంలో టీచర్ ఓట్లు 14 ఓట్లకు గాను 14 (100 శాతం) మంది ఓట్లు వేశారని, గ్రాడ్యుయేట్‌లు 221 ఓట్లకు గాను 170 (76 శాతం) మంది ఓట్లు వేశారని అధికారులు తెలిపారు.

లింగంపేట్ :ఎమ్మెల్సీ ఎన్నికలు పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం నాలుగు గంటల వరకు కొనసాగింది. మండలంలో పట్టభద్రులు 765 ఓటర్లు ఉండగా ఇందులో 599 పురుషులు, 166 స్త్రీలు ఉన్నారు. అదేవిధంగా ఉపాధ్యాయులు 34 మంది గాను 30 మంది పురుషులు, నలుగురు మహిళా టీచర్లు ఉన్నారు. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలో అధికార కాంగ్రెస్ పార్టీ బిజెపి పార్టీ నాయకులు విలువైన ఓటు వేయాలని పట్టభద్రులను వేడుకున్నారు. 100 మీటర్లలోపు ఇరు పార్టీల నాయకులు ఉండడంతో ఎల్లారెడ్డి డి.ఎస్.పి శ్రీనివాస్ వారిని చెదరగొట్టారు. 100 మీటర్ల లోపు ప్రచారం చేయరాదని పోలింగ్ కేంద్రానికి దూరంగా ఉండాలని వారికి సూచించారు. పోలింగ్ కేంద్ర వద్ద ఎల్లారెడ్డి డిఎస్పి శ్రీనివాస్, లింగంపేట ఎస్సై వెంకట్రావు, పోలీసులను పెద్ద ఎత్తున మోహరించారు.

ఓటింగ్‌కు బారులు తీరిన ఓటర్లు..

సదాశివనగర్ :

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రాడ్యుయేట్స్ ఉపాధ్యాయ ఎన్నికలు నిర్వహించారు. ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఓటర్లు ఉదయం నుంచి బారులు తీరారు. ఓటింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఓటు వినియోగించుకోవడానికి మండలంలోని ప్రతి గ్రామంలోని గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పోలింగ్ సరళిని పరిశీలించిన అధికారులు

ఆర్మూర్:ఉపాధ్యాయ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. శివరాత్రి జాగరణ తో ఉదయం మందకొడిగా సాగిన పోలింగ్ ప్రక్రియ మధ్యాహ్నం జోరందుకుంది. ఏసీపి వెంకటేశ్వర్ రెడ్డి, సిఐ సత్యనారాయణ ,మున్సిపల్ కమిషనర్ రాజు, తహసిల్దార్ సత్యనారాయణ తదితరులు ఎన్నికల పోలింగ్ సరళని పర్యవేక్షించారు.రు. మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ పోలింగ్ కేంద్రం బయట ప్రధాన పార్టీ నాయకులు పరిశీలించారు.

ఆర్మూర్ మండలంలో గ్రాడ్యుయేట్ ఓటర్లు 3708 మంది ఉండగా పోలైన ఓట్లు 2807.. కాగా ఇందులో పురుషులు 1705, మహిళలు 1102. పోలింగ్ శాతం 75.70శాతం, టీచర్ ఓటర్లు మొత్తం 456కాగా పోలైన ఓట్లు 42 కాగా పురుషులు 270, మహిళలు 155. పోలింగ్ శాతం 93.20శాతంగా నమోదయింది

ఆలూరు మండల కేంద్రంలో..

ఆలూర్ మండలంలోని 158 పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ ముగిసే సమయానికి 84.45 శాతం ఓటింగ్ నమోదైంది. మొత్తం ఓటర్ల సంఖ్య 592 పోలైన ఓట్లు 500 పురుషులు 323 స్త్రీలు 177. టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటింగ్ శాతం అత్యధికంగా నమోదైంది. మొత్తం 39 ఓట్లకు గాను 38 ఓట్లు పోలయ్యాయి, దీంతో 98శాతం ఓటింగ్ నమోదైందని అధికారులు తెలిపారు. మొత్తం పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా, నిబంధనలకు అనుగుణంగా సాగిందని ఎన్నికల అధికారులు వెల్లడించారు.



ఆర్మూర్‌లో..